ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక



సంపుటి: 6 సంచిక: 132, పేజీలు - 08

శుక్రవారం, నవంబర్ 13, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

పరిశ్రమల భూములపై రియల్ దందా.?

- ఉప్పల్ లో పారిశ్రామిక భూమిలో వాణిజ్య సామ్రాజ్యమా.?
- బిస్కెట్ ఫ్యాక్టరీ కోసం కేటాయించిన 6.88 ఎకరాల భూమిలో బహుళ అంతస్తుల నిర్మాణానికి అనుమతులెలా.?
- యాజమాన్య బదిలీల వెనుక అసలు కథేంటి.? భూ వినియోగ మార్పునకు ఎవరి ఆమోదం.?
- 2024 భవన అనుమతులపై అనుమానాలు, విచారణ పూర్తయ్యే వరకు నిర్మాణ అనుమతులు నిలిపివేయాలని డిమాండ్





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) పరిశ్రమలు రావాలి, వేలాది మందికి ఉపాధి కలగాలి, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి బాటలు వడాలనే లక్ష్యంతో ప్రభుత్వం కేటాయించిన పారిశ్రామిక భూములు ఇప్పుడు ప్రైవేటు వ్యాపార కేంద్రాలుగా మారుతున్నాయా.? పరిశ్రమల స్థాపన కోసం ఇచ్చిన భూముల్లో బహుళ అంతస్తుల వాణిజ్య భవనాలు వెలుస్తుంటే సంబంధిత అధికారులు ఏం చేస్తున్నారు.? నిబంధనల పరిరక్షణకు బాధ్యత వహించాల్సిన యంత్రాంగమే అనుమతుల మంజూరులో కీలక పాత్ర పోషించిందా.? ఉప్పల్ లో వెలుగులోకి వచ్చిన భూవ్యవహారం ప్రభుత్వ భూముల కేటాయింపులు, యాజమాన్య బదిలీలు, భవన నిర్మాణ అనుమతులపై అనేక అనుమానాలకు తెరలేపుతోంది.

బిస్కెట్ ఫ్యాక్టరీ పేరుతో భూమి కేటాయింపు

1968 జనవరి 23న సేల్ డీడ్ నంబర్ 376/68 ద్వారా సుమారు 6.88 ఎకరాల భూమిని బిస్కెట్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'జీవన్ ఫుడ్స్' సంస్థకు కేటాయించినట్లు పత్రాల్లో ఉన్నట్లు సమాచారం. అయితే ఈ భూమిని పారిశ్రామిక అవసరాలకే వినియోగించాలనే షరతులు విధించడంతో పాటు, నిబంధనలు ఉల్లంఘిస్తే తిరిగి స్వాధీనం చేసుకునే అధికారం ప్రభుత్వానికి ఉన్నట్లు పేర్కొన్నట్లు తెలుస్తోంది. మరి ఆ షరతులు నేటికీ అమల్లో ఉన్నాయా.? పరిశ్రమల కోసం కేటాయించిన భూమి వాణిజ్య కార్యకలాపాలకు ఎలా మారింది.?

పెట్రోల్ బంక్ అనుమతులతో బహుళ అంతస్తుల నిర్మాణమా.?


2006లో పెట్రోల్ బంక్ ఏర్పాటుకు జారీ చేసిన ఎన్ఓసి పత్రాలు, ఇతర నిర్మాణ అనుమతుల ఆధారంగా ప్రస్తుతం బహుళ అంతస్తుల వాణిజ్య సముదాయం నిర్మాణానికి అనుమతులు పొందినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అసలు పెట్రోల్ బంక్ అనుమతులకు, భారీ వాణిజ్య భవన నిర్మాణానికి సంబంధం ఏమిటి.? భూ వినియోగ మార్పునకు టీజీఐఐసీ లేదా సంబంధిత పారిశ్రామిక సంస్థ అనుమతి ఇచ్చిందా.? ఇచ్చి ఉంటే ఆ ఉత్తర్వులు ఎక్కడున్నాయి.? అధికారులు సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని స్థానికులు పేర్కొంటున్నారు.

యాజమాన్యాల మార్పు.. తెరవెనుక వ్యవహారాలెన్నో

2005లో షెల్ ఇండియాకు బదిలీ అయినట్లు పేర్కొంటున్న భూమి, మధ్యలో ఇండూ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ పేరుతో ప్రస్తావనకు వచ్చి, 2024 నాటికి వాసవి ఎకో స్పేసెస్ ఎల్ఎల్పీ చేతికి ఎలా చేరింది.? ప్రతి బదిలీకి ప్రభుత్వ ముందస్తు అనుమతి ఉందా.? ఎస్బీఐ తనఖా విడుదల పత్రాలు, బ్యాంకు సమ్మతి, భూమి బదిలీకి సంబంధించిన చట్టబద్ధమైన ఆధారాలను అధికారులు పరిశీలించారా.? లేక పత్రాల ఆధారంగానే అనుమతుల ప్రక్రియ ముగించేశారా.? వంటి అనేక ప్రశ్నలకు టీజీఐఐసీ అధికారుల మౌనం విద్దూరంగా మారింది.

భూమి లెక్కల్లో తేడాలు.. అనుమతుల్లో మతలబేంటి.?

సేల్ డీడ్, ఉపవిభజన పత్రాల్లోని భూవిస్తీర్ణాలకు, 2024లో మంజూరైన భవన నిర్మాణ అనుమతుల్లో చూపిన వివరాలకు మధ్య వ్యత్యాసాలున్నాయనే ఆరోపణలు మరిన్ని సందేహాలకు తావిస్తున్నాయి. ముఖ్యంగా రోడ్డు ప్రభావిత ప్రాంతం పేరుతో 604.01 చదరపు మీటర్లు చూపించడం, అది మొత్తం స్థలంలో సుమారు 24 శాతం కావడంపై స్పష్టత అవసరం. ఈ మేరకు భూమి రోడ్డు విస్తరణకు కేటాయించారా.? పరిహారం చెల్లించారా.? సంబంధిత రికార్డులు ఏమి చెబుతున్నాయి.? అన్న దానిపై అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



అనుమతులు నిలిపివేయాలి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

బిల్డింగ్ పర్మిట్ నంబర్ ఐఐసి/1361/2024కు సంబంధించిన పూర్తి అనుమతి పత్రాలు, దస్త్రాలు, నోటు పత్రాలను బహిర్గతం చేయాలని ప్రజలు కోరుతున్నారు. విచారణ పూర్తయ్యే వరకు అనుమతులను తాత్కాలికంగా నిలిపివేసి, భూ కేటాయింపు నుంచి ప్రస్తుత నిర్మాణం వరకు జరిగిన ప్రతి లావాదేవీపై సమగ్ర విచారణ చేపట్టాలి. నిబంధనల ఉల్లంఘనలు నిర్ధారణ అయితే బాధ్యులైన అధికారులపైనా, సంబంధిత సంస్థలపైనా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజల కోరుతున్నారు.

ప్రభుత్వం పరిశ్రమల కోసం ఇచ్చిన భూములు ప్రైవేటు వాణిజ్య ప్రయోజనాలకు వేదికలుగా మారితే పారిశ్రామిక అభివృద్ధి లక్ష్యమే నీరుగారిపోతుంది. ఉప్పల్లోని ఈ వ్యవహారంలో అసలు నిజాలు నిగ్గు తేల్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ప్రజాధనం, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో రాజీ పడితే సహించేది లేదని, ఐలా అధికారుల అవినీతి వ్యవహారాలపై పూర్తిస్థాయి విచారణ చేయించాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. కమిషనర్, ఉన్నత అధికారులు ఇప్పటికైనా మౌనం వీడి వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రూ.7 కోట్లు ఇవ్వకుంటే

కేజ్రీవాల్ను చంపేస్తాం

- లారెన్స్ బిష్ణోయ్ ముఠా పేరుతో హత్య బెదిరింపు

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దేశ రాజధాని ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధినేత అరవింద్ కేజ్రీవాల్కు ప్రాణహాని ఉందంటూ వచ్చిన బెదిరింపు కాల్స్ రాజకీయ వర్గాల్లో తీవ్ర సంచలనం సృష్టిస్తున్నాయి. కరడుగట్టిన గ్యాంగ్స్టర్ లారెన్స్ బిష్ణోయ్ ముఠా పేరుతో ఈ హత్య బెదిరింపులు రావడంతో భద్రతా ఏజెన్సీలు, పోలీసులు అత్యంత అప్రమత్తమయ్యాయి. రూ. 7 కోట్లు చెల్లించకపోతే అరవింద్ కేజ్రీవాల్ను, ఆయన కుమార్తె హర్షిత కేజ్రీవాల్ను అంతమొందిస్తామని ఆగంతకుడు హెచ్చరించినట్లు వెల్లడి అయింది.

2లో..



ప్రభుత్వాలు మారినా..

పెట్టుబడులకు ఢోకా లేదు

- పెట్టుబడిదారులకు చంద్రబాబు సావరిన్ గ్యారెంటీ

- ఇన్వెస్ట్మెంట్ ప్రొటెక్షన్ యాక్ట్కు శ్రీకారం - -పారిశ్రామిక ఒప్పందాలకు శాశ్వత చట్టబద్ధ రక్షణ
- రాయితీలు, ప్రోత్సాహకాల కోసం ప్రత్యేక ఎస్క్రో ఖాతాలు
- ఈజ్ ఆఫ్ డూయింగ్ కాదు.. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ మా లక్ష్యం
- సీఐఐ భాగస్వామ్య సదస్సులో సీఎం కీలక ప్రకటన



విశాఖపట్నం (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్లో పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తిరుగులేని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినా పారిశ్రామిక ఒప్పందాలు, పెట్టుబడిదారుల ప్రయోజనాలకు ఎలాంటి ముప్పు వాటిల్లకుండా ప్రత్యేక చట్టాన్ని తీసుకురానున్నట్లు ప్రకటించారు. విశాఖపట్నం వేదికగా జరుగుతున్న 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సులో అంతర్జాతీయ పారిశ్రామిక దిగ్గజాలను ఉద్దేశించి ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. రాష్ట్రానికి

2లో..

22-ఏ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి

- ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్లో ఉండకూడదన్న పొంగులేటి

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న 22-ఏ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఈ దిశగా ప్రజా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను వేగవంతంగా, క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేసి దరఖాస్తుదారులకు ఉపశమనం కల్పించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. 22-ఏ సమస్యల పరిష్కారానికి ఇటీవల కాలంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు క్షేత్రస్థాయిలో అమలు పరిష్కారంలో ఎదురవుతున్న సమస్యలు తదితర అంశాలపై

2లో..



తెలంగాణలో భారీగా

ఐపీఎస్ల బదిలీలు

- 21 మంది అధికారులకు కొత్త బాధ్యతలు

- హైదరాబాద్ పోలీస్ కమిషనర్గా మహేష్ భగవత్
- ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్ డీజీగా వీసీ సజ్జనార్
- ఏసీబీ, మహిళా భద్రత తదితర విభాగాల్లో కీలక మార్పులు
- పోలీస్ శాఖలో పరిపాలనా పునర్వ్యవస్థీకరణ



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రంలో పోలీస్ శాఖలో భారీ స్థాయిలో బదిలీలు చోటుచేసుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం 21 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. పోలీస్ శాఖతో పాటు వివిధ ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తున్న పలువురు సీనియర్ అధికారులకు కొత్త బాధ్యతలు అప్పగించింది. ముఖ్యంగా హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్, అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ), ఫైర్ అండ్ డిజాస్టర్ రెస్పాన్స్,

3లో..

లక్ష మందితో వలంటీర్ల వ్యవస్థ

- సంక్షేమానికి తోడ్పాటా, పొలిటికల్ రిస్కా?

- ప్రతి 50-100 కుటుంబాలకు ఒక ప్రతినిధి నియామకంపై కసరత్తు?
- ఆరు గ్యారెంటీల అమలుకు క్షేత్రస్థాయి పర్యవేక్షణ
- నిరుద్యోగ యువతకు గౌరవ వేతనంతో అవకాశం
- ఏపీ అనుభవాల నేపథ్యంలో రాజకీయ వర్గాల్లో చర్చ

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో సంక్షేమ పథకాల అమలుకు మరింత వేగం పెంచడంతో పాటు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య ఉన్న దూరాన్ని తగ్గించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం సరికొత్త ఆలోచన చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు లక్ష మందితో వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసే ప్రతిపాదనపై కసరత్తు జరుగుతోందన్న ప్రచారం ఆసక్తి రేపుతోంది. ఆరు గ్యారెంటీలతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల ఫలాలను అర్హులైన లబ్ధిదారుల ఇంటి వద్దకే చేర్చడం, క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించడం ఈ ప్రతిపాదన వెనుక ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. అయితే పరిపాలనా పరంగా ప్రయోజనకరంగా కనిపిస్తున్న ఈ ఆలోచన రాజకీయంగా ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందన్న చర్చ కూడా మొదలైంది.

2లో..

అభివృద్ధిలో మోదీ-బాబుది

2లో..

'ఆర్ఆర్ఆర్' జోడీ

- సీఎం చంద్రబాబుపై గోయెల్ ప్రశంసల వర్షం



లక్ష మందితో వలంటీర్ల వ్యవస్థ

ప్రజాబలం పేరుతో పల్లెబాట

ప్రజలకు మరింత చేరువయ్యేందుకు త్వరలోనే 'ప్రజాబలం' కార్యక్రమం పేరుతో గ్రామాల పర్యటనకు సీఎం రేవంత్ రెడ్డి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ప్రతి గ్రామాన్ని సందర్శించి ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వ పథకాల అమలు తీరును పరిశీలించాలన్నది ఈ కార్యక్రమం లక్ష్యంగా కనిపిస్తోంది. ఈ క్రమంలో క్షేత్రస్థాయిలో ఒక పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని ప్రభుత్వం గుర్తించినట్లు సమాచారం. పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు సహా వివిధ సంక్షేమ పథకాల అమలులో దళారుల ప్రమేయాన్ని అరికట్టడం, అర్హులకు ప్రభుత్వ ప్రయోజనాలు అందేలా చూడటం కీలక అంశాలుగా మారనున్నాయి. సచివాలయం నుంచి జారీ అయ్యే ఆదేశాలకు, గ్రామస్థాయిలో జరిగే అమలుకు మధ్య ఉన్న సమాచార లోటును పూడ్చేందుకు స్థానికంగా బాధ్యతాయుతమైన ప్రతినిధులను అందుబాటులో ఉంచాలన్న ఆలోచన ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

100 కుటుంబాలకు ఒకరు

ప్రతి 50 లేదా 100 కుటుంబాలకు ఒక వలంటీర్‌ను నియమించే విధానాన్ని పరిశీలిస్తే క్షేత్రస్థాయిలో ప్రభుత్వానికి బలమైన సమాచార వ్యవస్థ ఏర్పడే అవకాశం ఉంది. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, వినతులు, స్థానిక సమస్యలను ఎప్పటికప్పుడు సేకరించి సంబంధిత అధికారులకు చేరవేయడం వీరి ప్రధాన బాధ్యతగా ఉండవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లోని చదువుకున్న నిరుద్యోగ యువతకు గౌరవ వేతనంతో ఉపాధి కల్పించే అవకాశమూ ఈ ప్రతిపాదనలో మరో కీలక అంశం. ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల వివరాలు, వాటి అమలు పురోగతి, ప్రజల అవసరాలపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించడం ద్వారా పాలనను మరింత సమర్థవంతంగా మార్చవచ్చని వ్యూహకర్తలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ప్రజల ఇంటి ముంగిటకే వచ్చిందన్న విశ్వాసాన్ని కల్పించడంలో ఈ వ్యవస్థ కీలకంగా మారే అవకాశం ఉంది.

ఏపీ అనుభవమే అసలు సవాల్

అయితే వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటుపై సానుకూలతతో పాటు రాజకీయపరమైన ఆందోళనలు కూడా వ్యక్తమవుతున్నాయి. పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సుమారు 2.5 లక్షల మందితో వలంటీర్ల వ్యవస్థ పనిచేసింది. ప్రజలకు ప్రభుత్వ సేవలను చేరువ చేయడంలో ఈ వ్యవస్థ కొంత ప్రజాదరణ పొందినప్పటికీ, కాలక్రమంలో రాజకీయ విమర్శలకు కేంద్రబిందువుగా మారింది. అధికార పార్టీ కార్యకర్తలకు ఉపాధి కల్పించేందుకు ఈ వ్యవస్థను ఉపయోగించుకున్నారనే ఆరోపణలు, ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని సేకరించి రాజకీయ ప్రయోజనాలకు వినియోగించారనే విమర్శలు వెల్లువెత్తాయి. వలంటీర్లను పార్టీ ప్రయోజనాల కోసం ఉపయోగించుకున్నారంటూ ప్రతిపక్షాలు తీవ్రంగా ఆరోపించాయి. చివరకు ఈ వ్యవస్థపై వచ్చిన విమర్శలు కూడా ఏపీలో రాజకీయ చర్చలో కీలక అంశంగా నిలిచాయి. ఇప్పుడు తెలంగాణలోనూ ఇలాంటి వ్యవస్థను ప్రవేశపెడితే బీఆర్ఎస్, బీజేపీలకు ప్రభుత్వంపై విమర్శలు చేసేందుకు బలమైన అవకాశం లభించవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

నిరుద్యోగుల్లోకి ప్రతిపక్షాల ప్రచారాస్త్రం

వలంటీర్ల నియామకాలు ప్రభుత్వానికి రాజకీయంగా మేలు చేయకపోగా ఎదురుదెబ్బగా మారే ప్రమాదం ఉందన్న విశ్లేషణలూ వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నిధులతో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు వేతనాలు చెల్లిస్తున్నారనే ప్రచారాన్ని ప్రతిపక్షాలు ప్రజల్లోకి తీసుకెళ్లే అవకాశం ఉంది. మరోవైపు శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతలోనూ అసంతృప్తి పెరిగే ప్రమాదం ఉంది. రెగ్యులర్ ఉద్యోగాల భర్తీకి బదులుగా గౌరవ వేతనంతో కూడిన తాత్కాలిక నియామకాలకే ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందనే విమర్శలు ఎదురుకావచ్చు. ముఖ్యంగా నిరుద్యోగ సమస్యపై ఇప్పటికే ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాలకు ఇది మరో రాజకీయ అస్త్రంగా మారే అవకాశం లేకపోలేదు.

డేటా ప్రైవసీతో న్యాయపరమైన చిక్కులు

వలంటీర్ల ద్వారా ప్రజల వ్యక్తిగత వివరాలు, కుటుంబాల సమాచారం, సంక్షేమ పథకాల లబ్ధిదారుల డేటా సేకరించే సందర్భంలో గోప్యతకు సంబంధించిన అంశాలు కీలకంగా మారనున్నాయి. సేకరించిన సమాచారాన్ని ఎవరు నిర్వహిస్తారు? దాని వినియోగంపై ఎలాంటి నియంత్రణ ఉంటుంది? రాజకీయ ప్రయోజనాలకు దుర్వినియోగం కాకుండా ఎలాంటి భద్రతా చర్యలు తీసుకుంటారు? అన్న ప్రశ్నలకు ప్రభుత్వం స్పష్టమైన సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. నియామకాల ప్రక్రియ నుంచి విధుల నిర్వహణ వరకు పారదర్శకమైన నిబంధనలు లేకుంటే ఈ వ్యవస్థ వివాదాలకు కేంద్రంగా మారే ప్రమాదం ఉంది.

రాజకీయ రంగు పడకుండా నడపగలరా?

ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు చేరవేయడం, ప్రజల సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపడం అనే లక్ష్యంతో చూస్తే లక్ష మంది వలంటీర్ల వ్యవస్థ ఒక సమర్థవంతమైన పరిపాలనా ప్రతిపాదన కావచ్చు. కానీ దానిని పూర్తిగా రాజకీయాలకు అతీతంగా, నిష్పాక్షికమైన ప్రభుత్వ సేవా వ్యవస్థగా నిర్వహించడం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి అసలైన పరీక్ష కానుంది. నియామకాల్లో రాజకీయ జోక్యానికి తావులేకుండా చూడటం, విధులకు స్పష్టమైన పరిధి నిర్ణయించడం, డేటా భద్రతకు పటిష్టమైన నిబంధనలు రూపొందించడం అత్యవసరం. ఏపీ అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకుని పారదర్శకతకు పెద్దపీట వేస్తే ఈ వ్యవస్థ ప్రభుత్వానికి ప్రజాభిమానాన్ని పెంచే సాధనంగా మారవచ్చు. లేదంటే సంక్షేమం కోసం వేసిన అడుగు రాజకీయంగా కాంగ్రెస్‌కే ఎదురుదెబ్బగా పరిణమించే ప్రమాదం ఉంది.

ప్రభుత్వాలు మారినా..పెట్టుబడులకు ధోకా లేదు

వచ్చే పెట్టుబడులకు చట్టబద్ధమైన రక్షణ కల్పించడమే లక్ష్యంగా 'ఇన్వెస్ట్‌మెంట్ ప్రొటెక్షన్ యాక్ట్'ను రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ చట్టం పెట్టుబడిదారులకు ప్రభుత్వం కల్పించే సావరిన్ గ్యారెంటీగా నిలుస్తుందని స్పష్టం చేశారు.



ఒప్పందాలకు శాశ్వత భరోసా

ప్రభుత్వాలు మారినప్పుడల్లా పారిశ్రామిక విధానాలు మారడం, గత ప్రభుత్వాలు చేసుకున్న ఒప్పందాలను కొత్త ప్రభుత్వాలు సమీక్షించడం, రద్దు చేయడం వంటి పరిణామాలకు ఇకపై తావులేకుండా చట్టాన్ని రూపొందించనున్నట్లు చంద్రబాబు వివరించారు. ప్రభుత్వంతో ఒకసారి ఒప్పందం కుదుర్చుకున్న తర్వాత కేటాయించిన భూములు, ప్రకటించిన రాయితీలు, ప్రోత్సాహకాలు, ఇతర ప్రయోజనాలను తదుపరి ప్రభుత్వాలు ఏకపక్షంగా రద్దు చేయకుండా చట్టపరమైన రక్షణ కల్పించడమే ఈ విధానం ప్రధాన ఉద్దేశమన్నారు. పెట్టుబడిదారుల హక్కులకు భంగం కలిగితే సత్వర న్యాయపరమైన పరిష్కారం లభించేలా అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నిబంధనలు రూపొందిస్తున్నట్లు తెలిపారు.

గత అనుభవాలకు చెక్

2019--2024 మధ్య రాష్ట్రంలో చోటుచేసుకున్న రివర్స్ టెండరింగ్, విద్యుత్ కొనుగోలు ఒప్పందాల రద్దు, పారిశ్రామిక సంస్థలకు ఎదురైన వివాదాలు, వేధింపుల కారణంగా ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతిన్న విషయాన్ని సీఎం పరోక్షంగా ప్రస్తావించారు. రాజకీయ మార్పులతో పారిశ్రామిక విధానాలు మారిపోతాయనే భయాన్ని పెట్టుబడిదారుల్లో తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో ఎదురైన చేదు అనుభవాలు పునరావృతం కాకుండా, పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని పునరుద్ధరించేందుకు ఈ చట్టం బలమైన రక్షణ కవచంలా పనిచేస్తుందని వివరించారు.

రాయితీలకు ఎస్క్రో భరోసా

పెట్టుబడిదారులకు కేవలం చట్టపరమైన రక్షణ మాత్రమే కాకుండా ఆర్థికపరమైన భరోసా కల్పించేందుకు ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. పరిశ్రమలకు ప్రకటించిన రాయితీలు, ప్రోత్సాహకాలు సకాలంలో అందించేందుకు ప్రత్యేక ఎస్క్రో ఖాతాల వ్యవస్థను తీసుకురానున్నట్లు వెల్లడించింది. ప్రభుత్వ ఖజానా పరిస్థితులు, రాజకీయ జోక్యం, పరిపాలనా జాప్యాలతో సంబంధం లేకుండా అర్హులైన పారిశ్రామికవేత్తలకు రావాల్సిన ప్రయోజనాలు పారదర్శకంగా, నిర్ణీత సమయంలో అందేలా ఈ విధానం దోహదపడనుంది. పెట్టుబడుల విషయంలో ఆర్థిక భరోసాను మరింత బలోపేతం చేయనుంది.

స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్

పరిశ్రమల స్థాపనకు అనుమతులు ఇవ్వడంలో వేగమే ప్రధాన ప్రాధాన్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. ఇప్పటివరకు అమలులో ఉన్న 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానాన్ని అధిగమించి 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. పరిశ్రమలకు అవసరమైన అనుమతులను రియల్ టైమ్‌లో మంజూరు చేయడం, అధికార యంత్రాంగంలో జాప్యాలను తొలగించడం, పెట్టుబడిదారులకు సత్వర సేవలు అందించడం తమ ప్రభుత్వ ప్రాధాన్యాలుగా పేర్కొన్నారు.

గ్రీన్ ఎనర్జీ నుంచి ఏఐ వరకు

ప్రపంచస్థాయి పెట్టుబడులను ఆకర్షించేందుకు విశాఖపట్నం, అమరావతి, తిరుపతిని ప్రధాన పారిశ్రామిక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తున్నట్లు సీఎం వివరించారు. గ్రీన్ ఎనర్జీ, స్పేస్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సెమీకండక్టర్ రంగాల్లో అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులు కల్పిస్తున్నామని గ్లోబల్ సీఈఓలకు వివరించారు.

పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం, వేగవంతమైన అనుమతులు, స్థిరమైన పారిశ్రామిక విధానాలతో ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని స్పష్టం చేశారు.

దేశ పారిశ్రామిక రంగానికి కొత్త దిశ

ప్రభుత్వాల మార్పుతో సంబంధం లేకుండా పెట్టుబడులకు చట్టబద్ధమైన భద్రత కల్పించాలన్న చంద్రబాబు ప్రతిపాదన పారిశ్రామిక రంగంలో ప్రాధాన్యం సంతరించుకుంది. ఇన్వెస్ట్‌మెంట్ ప్రొటెక్షన్ యాక్ట్, ఎస్క్రో ఖాతాల విధానం అమల్లోకి వస్తే పెట్టుబడిదారులకు దీర్ఘకాలిక విశ్వాసం కల్పించే అవకాశముంది. రాజకీయ అనిశ్చితికి తావులేని పారిశ్రామిక వాతావరణాన్ని సృష్టించడం ద్వారా అంతర్జాతీయ సంస్థలను ఆంధ్రప్రదేశ్ వైపు ఆకర్షించేందుకు ఈ నిర్ణయం కీలకంగా మారనుంది. రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధితో పాటు దేశంలోని ఇతర రాష్ట్రాల పెట్టుబడి విధానాలపైనా ఈ ప్రతిపాదన ప్రభావం చూపే అవకాశం ఉంది.

22-ఏ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి

గురువారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలోని తన కార్యాలయంలో హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు, జిల్లా రిజిస్ట్రార్లతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. 22-ఏ దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలి అని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

ఏ ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్‌లో ఉండటానికి వీల్లేదు

22-ఏ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర శాసనసభలో ఇచ్చిన హామీలకు అనుగుణంగా జీవో 118, జీవో 76లకు సంబంధించి మెమోలు, 22-ఏ జాబితాలో ఉన్నప్పటికీ జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ, మున్సిపల్ అనుమతులు కలిగిన ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లకు అనుమతులు, యూఎల్‌సీ దరఖాస్తుల పరిష్కారం, నాలా ప్రక్రియ పూర్తికాని పట్టా భూముల సమస్యల పరిష్కారం, జీవో 59 అమలు తదితర అంశాలకు సంబంధించి ప్రభుత్వం స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ అంశాలకు సంబంధించి ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులన్నింటినీ యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని, ఏ ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్‌లో ఉండటానికి వీల్లేదని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను పకడ్బందీగా అమలు చేయాల్సిన బాధ్యత కలెక్టర్లదేనని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

అర్హులైన వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలి

ప్రతి వారం జిల్లా స్థాయిలో కలెక్టర్, జిల్లా రిజిస్ట్రార్, ఇతర సంబంధిత అధికారులు సమావేశమై 22-ఏ సమస్యల పరిష్కారంపై సమీక్షించుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. జిల్లా స్థాయిలో పరిష్కరించడానికి వీలుకాని అంశాలను రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్‌కుమార్ నాయకత్వంలోని ఉన్నతస్థాయి కమిటీకి సిఫార్సు చేయాలని సూచించారు. ప్రభుత్వం తీసుకుంటున్న విధానపరమైన నిర్ణయాలు, జారీ చేస్తున్న జీవోలు, మెమోలు కేవలం ప్రభుత్వ ఉత్తర్వులకే పరిమితం కాకూడదని, వాటి అసలు ఉద్దేశం క్షేత్రస్థాయిలో అమలైనప్పుడే ప్రజలకు నిజమైన మేలు జరుగుతుందని మంత్రి అన్నారు. ముఖ్యంగా కలెక్టర్లు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను క్షుణ్ణంగా పరిశీలించి, వాటి ప్రకారం అర్హులైన వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచించారు.

నిజమైన యజమానులకే భూములపై హక్కులు కల్పించాలి

యూఎల్ సికి సంబంధించి వివిధ కోర్టులు వెలువరించిన తుది తీర్పులు, ప్రభుత్వం తరఫున స్పెషల్ లీవ్ పిటిషన్లు (ఎస్ఎల్‌పీలు) దాఖలు చేసే అంశాలు, ఎస్ఎల్‌పీలు దాఖలు చేయడానికి అవకాశం లేని ఇతర అంశాలన్నింటిపై వారం రోజుల్లోగా ఉన్నతస్థాయి కమిటీ సమగ్ర నివేదిక అందించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. ఈ నివేదికపై గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి రెగ్యులరైజేషన్‌పై తగిన నిర్ణయం తీసుకుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. 22-ఏ జాబితాలో ఉన్న ప్రతి భూమికి సంబంధించిన రెవెన్యూ రికార్డులు, రిజిస్ట్రేషన్ వివరాలు, సంబంధిత ఆధారాలను సమగ్రంగా పరిశీలించాలని అధికారులకు సూచించారు.

క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను నిర్ధారించిన తర్వాతే తగిన నిర్ణయాలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నిజమైన యజమానులు తమ భూములపై హక్కులు పొందేందుకు అనవసరమైన జాప్యం జరగకుండా, కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితులు లేకుండా చూడాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.

అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను అమలు చేయడంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అర్హులకు న్యాయం చేసే క్రమంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. అదే సమయంలో ప్రభుత్వ భూములు, ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన భూముల విషయంలో నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచించారు.

అభివృద్ధిలో మోదీ-బాబుది

'ఆర్ఆర్ఆర్' జోడీ

- సీఎం చంద్రబాబుపై గోయెల్ ప్రశంసల వర్షం

విశాఖపట్నం (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగానికి అంతర్జాతీయ గుర్తింపు తీసుకొచ్చేలా విశాఖపట్నం మరో కీలక ఘనతను సాధించనుంది. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) భాగస్వామ్య సదస్సులకు విశాఖ నగరం శాశ్వత వేదికగా మారనుందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయెల్ ప్రకటించారు. విశాఖలో నిర్వహించిన సీఐఐ సదస్సులో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలన, రాష్ట్రంలో పెట్టుబడులకు కల్పిస్తున్న అనుకూల వాతావరణంపై ప్రశంసలు కురిపించారు. ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు అభివృద్ధి దార్శనికతను 'ఆర్ఆర్ఆర్' సినిమాలోని నీరు, నిప్పుతో పోల్చారు. ఇద్దరూ తమదైన శైలిలో కలిసి దేశాన్ని, రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు.

స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో దూకుడు

ప్రపంచవ్యాప్తంగా ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ గురించి చర్చ జరుగుతుంటే.. చంద్రబాబు మాత్రం 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'కు ప్రాధాన్యం ఇస్తూ పాలనలో వేగాన్ని తీసుకొస్తున్నారని గోయెల్ పేర్కొన్నారు. కాలానికి ముందే ఆలోచించే నాయకుడిగా చంద్రబాబు ఏఐ, క్వాంటం టెక్నాలజీల ప్రాధాన్యతను గుర్తించి, వాటి అభివృద్ధికి బాటలు వేశారని ప్రశంసించారు. ఇటీవల రాష్ట్రాన్ని రెండు తీవ్ర తుపాన్లు అతలాకుతలం చేసినప్పటికీ, విశాఖ వేగంగా కోలుకుని అంతర్జాతీయ స్థాయి సదస్సుకు ఆతిథ్యం ఇవ్వడం అభినందనీయమన్నారు. 2024లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టే సమయానికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అప్పుల్లో కూరుకుపోయిందని, పాలనా వ్యవస్థలు బలహీనపడ్డాయని గుర్తుచేశారు. అయినప్పటికీ పట్టుదలతో రాష్ట్రాన్ని పునరుద్ధరిస్తూ పెట్టుబడిదారులకు అనుకూలమైన గమ్యస్థానంగా తీర్చిదిద్దుతున్నారని అన్నారు. పారిశ్రామిక ప్రోత్సాహకాలు సకాలంలో అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఎస్క్రో ఖాతాను ఏర్పాటు చేయడం పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని పెంచే కీలక నిర్ణయమని అభివర్ణించారు.

పెట్టుబడులకు భారత్ భరోసా

ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి, సంక్షోభ పరిస్థితులు నెలకొన్న ప్రస్తుత తరుణంలో భారత్ పెట్టుబడులకు అత్యంత సురక్షితమైన, విశ్వసనీయమైన గమ్యస్థానంగా నిలుస్తోందని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. విదేశీ పెట్టుబడిదారులకు భరోసా కల్పించే సంప్రదాయం భారత్‌కు చారిత్రకంగా ఉందని గుర్తుచేశారు. కాకతీయ రాజు గణపతిదేవుడి కాలం నుంచే విదేశీ వ్యాపారులు, పెట్టుబడిదారులకు ప్రోత్సాహం కల్పించిన చరిత్ర మనకుందని పేర్కొన్నారు. ఇతర దేశాల సాంకేతికతను బలవంతంగా తీసుకోవడం, మేధోసంపత్తి హక్కులను ఉల్లంఘించడం భారత్ విధానం కాదని, అంతర్జాతీయ మేధోసంపత్తి హక్కులను దేశం గౌరవిస్తుందని వివరించారు.

సిలికాన్ సిటీగా విశాఖ.. గ్రీన్ ఎనర్జీకి ఏపీ చిరునామా

విశాఖపట్నం స్టీల్ సిటీ నుంచి సిలికాన్ సిటీగా రూపాంతరం చెందుతోందని గోయెల్ అన్నారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి అనేక అవకాశాలు ఉన్నాయని, ఓర్వకల్లు, పూడిమడక వంటి ప్రాంతాలు గ్రీన్ ఎనర్జీ హబ్‌లుగా ఎదుగుతున్నాయని పేర్కొన్నారు. తయారీ రంగం, పర్యాటకం, సాంకేతికత, పునరుత్పాదక ఇంధన రంగాల్లో ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశవ్యాప్తంగా అపారమైన అవకాశాలు ఉన్నాయని పారిశ్రామికవేత్తలకు వివరించారు. వాటిని అందిపుచ్చుకుని పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. 'దేశభాషలందు తెలుగు లెస్స' అని శ్రీకృష్ణదేవరాయలు కొనియాడిన తెలుగు నేలలో పెట్టుబడులు పెట్టడం ఆనందదాయకమని గోయెల్ వ్యాఖ్యానించారు. విశాఖకు సీఐఐ భాగస్వామ్య సదస్సుల శాశ్వత వేదిక హోదా కల్పించనున్న ప్రకటనతో రాష్ట్ర పారిశ్రామిక ప్రస్థానానికి అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు లభించనుందని పారిశ్రామిక వర్గాలు భావిస్తున్నాయి.

రూ.7 కోట్లు ఇవ్వకుంటే కేజ్రీవాల్ను చంపేస్తాం

ఎమ్మెల్యేకు ఫోన్ చేసి బెదిరింపులు

ఈ తీవ్ర పరిణామంపై ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన తిలక్ నగర్ ఎమ్మెల్యే జర్నైల్ సింగ్ తొలుత పోలీసులకు సమాచారం అందించారు. తనకు ఒక అపరిచిత వ్యక్తి నుంచి ఫోన్ కాల్‌తో పాటు వాట్సాప్ సందేశం కూడా వచ్చిందని ఆయన ఢిల్లీ పోలీసులకు తెలిపారు. విదేశాల్లో ఉన్న లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ సభ్యులతో తనకు సంబంధాలు ఉన్నాయని చెప్పుకుంటూ ఆ వ్యక్తి ఈ బెదిరింపులకు పాల్పడినట్లు జర్నైల్ సింగ్ తన ఫిర్యాదులో స్పష్టం చేశారు. ఈ ఘటనకు సంబంధించి నవంబర్ 6వ తేదీన పంజాబ్‌లోని మొహాలీ పోలీసులకు కూడా ఆయన అధికారికంగా ఫిర్యాదు సమర్పించారు. ఆగంతకుడు రూ. 7 కోట్ల భారీ మొత్తాన్ని డిమాండ్ చేశాడని, ఆ డబ్బు చెల్లించని పక్షంలో కేజ్రీవాల్‌తో పాటు ఆయన కుమార్తె హర్షిత ప్రాణాలకు హాని తలపెడతామని స్పష్టంగా బెదిరించాడని సింగ్ పేర్కొన్నారు.ఎమ్మెల్యే ఫిర్యాదును అత్యంత తీవ్రంగా పరిగణించిన మొహాలీ పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. భారతీయ న్యాయ సంహిత తో పాటు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద నిందితుడిపై కేసు నమోదు చేశారు. సాంకేతిక ఆధారాలను సేకరించేందుకు ఈ కీలక కేసు దర్యాప్తు బాధ్యతలను సైబర్ క్రైమ్ విభాగానికి చెందిన అధికారి సునీల్ కుమార్‌కు అప్పగించారు. బెదిరింపు కాల్స్, మెసేజ్‌లు పంపడానికి ఉపయోగించిన మొబైల్ నంబర్ ఆధారంగా దర్యాప్తు బృందాలు లోతైన విచారణ జరుపుతున్నాయి. సదరు నంబర్‌కు సంబంధించిన కాల్ డేటా రికార్డులు, ఇంటర్నెట్ ప్రోటోకాల్ (ఐపీ) లాగ్‌లు, లొకేషన్ వివరాలను నిపుణులు నిశితంగా పరిశీలిస్తున్నారు. ఈ బెదిరింపు నిజంగానే బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి వచ్చిందా లేక ఎవరైనా ఆకతాయిలు ఆ ముఠా పేరును వాడుకుని డబ్బులు వసూలు చేయడానికి ప్రయత్నిస్తున్నారా అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు.మరోవైపు ఈ బెదిరింపుల నేపథ్యంలో అరవింద్ కేజ్రీవాల్, ఆయన కుటుంబ సభ్యులకు తక్షణమే కట్టుదిట్టమైన, తగినంత భద్రత కల్పించాలని ఎమ్మెల్యే జర్నైల్ సింగ్ ప్రభుత్వాన్ని కోరారు. ప్రస్తుతం పంజాబ్ రాష్ట్రంలో భగవంత్ మాన్ నేతృత్వంలో ఆమ్ ఆద్మీ పార్టీ అధికారంలో ఉంది. పైగా పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలు జరగడానికి కేవలం కొన్ని నెలల సమయం మాత్రమే మిగిలి ఉన్న తరుణంలో పార్టీ అధినేతకు ఇలాంటి హత్య బెదిరింపులు రావడం రాజకీయంగా పెను ప్రాధాన్యతను సంతరించుకుంది. పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తును వేగవంతం చేశారు.

హైదరాబాద్ వేదికగా మార్స్ జీసీసీ విస్తరణ

- జెన్‌పాక్ట్‌తో కీలక భాగస్వామ్యం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ నగరం గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు (జీసీసీ) ప్రధాన కేంద్రంగా ఎదుగుతున్న క్రమంలో మరో ప్రముఖ అంతర్జాతీయ సంస్థ ఇక్కడ తన కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ప్రఖ్యాత సంస్థ 'మార్స్', ఐటీ సేవల సంస్థ 'జెన్‌పాక్ట్' భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన సరికొత్త గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌ను గురువారం తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు అధికారికంగా ప్రారంభించారు. ఈ సరికొత్త కేంద్రం ప్రస్తుతం 60,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో కార్యకలాపాలు మొదలుపెట్టింది. ప్రారంభ దశలో భాగంగా 400 నుంచి 525 మంది జెన్‌పాక్ట్ ఉద్యోగులతో కార్యకలాపాలు సాగనున్నాయి. భవిష్యత్తులో ఈ కేంద్రాన్ని మరింత విస్తరించేందుకు సంస్థ ప్రణాళికలు సిద్ధం చేసింది. రాబోయే కాలంలో మరో 70,000 చదరపు అడుగుల స్థలాన్ని జోడించి, ఉద్యోగుల సంఖ్యను దాదాపు 1,000 మంది మార్స్ అసోసియేట్స్ స్థాయికి విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ కేంద్రం ప్రధానంగా అత్యాధునిక సాంకేతిక సేవలపై దృష్టి సారించనుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సాఫ్ట్‌వేర్ అండ్ క్లౌడ్ ఇంజనీరింగ్, ఆటోమేషన్, డేటా అండ్ అనలిటిక్స్ వంటి కీలక టెక్నాలజీ విభాగాల్లో హైదరాబాద్ కేంద్రం నుంచి గ్లోబల్ సేవలు అందనున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా సాంకేతిక పరిష్కారాలను అందించడంలో ఈ విభాగం కీలక పాత్ర పోషించనుంది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. స్నికర్స్, ఎం అండ్ ఎమ్స్, పెడిగ్రీ, రాయల్ కెనైన్ వంటి ప్రపంచ ప్రఖ్యాత బ్రాండ్ల ద్వారా మార్స్ సంస్థ ప్రజలకు సుపరిచితమని పేర్కొన్నారు. అంతటి గుర్తింపు ఉన్న సంస్థ తమ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ఏర్పాటు కోసం హైదరాబాద్ నగరాన్ని ఎంచుకోవడం హర్షణీయమని తెలిపారు. తెలంగాణలో ఉన్న అనుకూల పారిశ్రామిక వాతావరణం, ప్రతిభావంతులైన మానవ వనరులు ఐటీ రంగ విస్తరణకు చక్కటి అవకాశాలను కల్పిస్తున్నాయని మంత్రి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మార్స్ మరియు జెన్‌పాక్ట్ బృందాలకు ఆయన అభినందనలు తెలియజేశారు.

షార్ట్ సర్క్యూట్ తో గుడిసె దగ్ధమైన
కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సాయం



దేవనకొండ దేవనకొండ మండలంలోని బీసీ కాలనీలో బోయ నాగరాజుకు చెందిన గుడిసె బుధవారం సాయంత్రం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది. దీంతో నిరాశ్రయులైన నాగరాజు కుటుంబాన్ని టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థి డా. షేక్ సాధిక, టీడీపీ సీనియర్ నాయకులు ఈదుల దేవరబండ సుభాన్,ఎంపీటీసీ ఆకుల వీరేష్, పరామర్శించి రూ.50 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి అందాల్సిన నిధులు, సహాయ సహకారాలు అందేలా తమ వంతు కృషి చేస్తామని, ప్రభుత్వ సహాయంతో పాటు తమ సహకారం కూడా ఎల్లప్పుడూ ఉంటుందని వారు భరోసా ఇచ్చారు. వెంకటసాయి ట్రేడర్స్ నిర్వాహకుడు కట్టా వేణుగోపాల్, శివ రేకుల షెడ్డు నిర్మాణానికి అవసరమైన సహాయ సహకారాలు అందించి నిర్మాణం చేపట్టేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబానికి అండగా నిలిచిన నాయకులకు నాగరాజు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బండి గింజల రంగన్న, సిలివేరి రామాంజి, శ్రీరాములు, కుక్కల తిమ్మయ్య, చంద్ బాషా, రాజసాహెబ్, రాజు గోపాల్ గౌడ్, బాలకృష్ణ, మోదీన్, రమేష్, శ్రీను, మజీద్, సుభాన్, రాముడు, చిన్నప్పతో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

అర్హత లేకుండా వైద్యం క్లినిక్‌ను సీజ్ చేసిన
వైద్య ఆరోగ్యశాఖ అధికారులు



రామాయంపేట మెదక్ జిల్లా రామాయంపేట మండలంలోని ఓ గ్రామంలో ఇంటర్ విద్యార్థిని గర్భం దాల్చిన ఘటనపై ఆర్ఎంపీ వైద్యుడు చికిత్స చేయడంతో గర్భంలోని శిశువు మృతి చెందాడనే ఆరోపణల నేపథ్యంలో గురువారం వైద్యాధికారులు విచారణ చేపట్టారు.అర్హత లేకుండా క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్ట నిబంధనలకు విరుద్ధంగా ప్రథమ చికిత్స కేంద్రం ముసుగులో వైద్యం అందిస్తున్న మోహన్ క్లినిక్‌ను జిల్లా వైద్యాధికారి జ్ఞానేశ్వర్ ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు డాక్టర్ హరిప్రసాద్ డి.ధర్మారం డాక్టర్ హరిప్రియ పీహెచ్‌సీ ఇన్‌చార్జి అన్వర్ సీహెచ్ఓ కొండయ్య కలిసి క్లినిక్‌పై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా క్లినిక్‌లో ఉన్న మందులు ఇంజెక్షన్లు గ్లూకోజ్ బాటిళ్లు రిజిస్టర్లు ప్రిస్క్రిప్షన్ చిట్టీలను పరిశీలించి నిబంధనలకు విరుద్ధంగా వైద్యం అందిస్తున్నట్లు గుర్తించి నోటీసులు జారీ చేసి క్లినిక్‌ను సీజ్ చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ హరిప్రసాద్ మాట్లాడుతూ ఆర్ఎంపీలు పీఎంపీలు ప్రథమ చికిత్సలో భాగంగా కేవలం గాయాలకు మందు పూయడం కట్లు కట్టడం వంటి సేవలు మాత్రమే అందించాలని సూచించారు.అర్హత లేకుండా వైద్యం అందిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అయన హెచ్చరించారు.

పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధం...

- శాంతియుత నిర్వహణకు కట్టుదిట్టమైన భద్రత !

- పల్నాడు జిల్లా ఎస్పీ జగదీష్ ఆదహళ్లి



నరసరావుపేట, పంచాయతీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పల్నాడు జిల్లా ఎస్పీ జగదీష్ ఆదహళ్లి పాల్గొన్నారు. ఎన్నికలను పూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పోలీస్ యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉందని జిల్లా ఎస్పీ తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని, సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచి ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రజలు భయాందోళనలు లేకుండా నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్పీ కోరారు.

ఎన్నికల నిర్వహణకు కలెక్టర్ దిశానిర్దేశం

- 19న కోఆప్షన్ సభ్యులు, ఉపాధ్యక్షుల ఎన్నికలు



నంద్యాల నవంబర్ 12: మండల ప్రజా పరిషత్ కోఆప్షన్ సభ్యులు, ఉపాధ్యక్షుల ఎన్నికలను నిబంధనల ప్రకారం పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారులు, ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నవంబర్ 19న సంబంధిత మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నవంబర్ 14లోపు సభ్యులకు ఎన్నికల నోటీసులు అందజేయాలని ఆదేశించారు. ఎన్నికల రోజున ఉదయం 10 గంటలలోపు నామినేషన్లు స్వీకరించి, 10 నుంచి 11 గంటల వరకు పరిశీలన చేపట్టాలన్నారు.అనంతరం మధ్యాహ్నం 1 గంటకు సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించి, కోఆప్షన్ సభ్యుల ఎన్నిక పూర్తి చేయాలని సూచించారు. ఆ తర్వాత ఉపాధ్యక్షుల ఎన్నిక నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఎన్నికల ప్రక్రియలో సమయపాలన పాటిస్తూ, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అన్ని రికార్డులను పక్కాగా నిర్వహించాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో సీఈవో శివశంకర్, జెడ్పీ సీఈవో సుబ్బారెడ్డి, డీఎల్‌డీవో శివారెడ్డి పాల్గొన్నారు.

షేక్ సాధిఖకు జెడ్పీ చైర్మన్ పీఠం కేటాయించాలి...!

- ముస్లిం మైనారిటీలకు సముచిత రాజకీయ గౌరవం కల్పించాలి..

- ముస్లిం మైనారిటీల డిమాండ్



హోళగుంద మండలం కేంద్రంలో గురువారం ముస్లిం మైనారిటీలకు రాజకీయంగా తగిన ప్రాధాన్యత కల్పించడంతో పాటు,సామాజిక న్యాయానికి పెద్దపీట వేయాలని ముస్లిం మైనారిటీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. షేక్ సాధిఖకు జిల్లా పరిషత్ చైర్మన్ పదవి కేటాయించి మైనారిటీల ఆకాంక్షలను గౌరవించాలని కోరారు.ఎంపీటీసీ?2, టీడీపీ కర్నూలు జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ బడేఘర్ అబ్దుల్ సుబాన్ ఆధ్వర్యంలో ముస్లిం మైనారిటీ నాయకులు ఈ డిమాండ్‌ను బలంగా వినిపించారు. ఈ సందర్భంగా ముస్లిం మైనారిటీలు మాట్లాడుతూ రాజకీయాల్లో మైనారిటీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించినప్పుడే అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందని వారు పేర్కొన్నారు.టీడీపీ విజయానికి, కూటమి బలోపేతానికి మైనారిటీ వర్గాలు తమ వంతు సహకారం అందిస్తున్నాయని, అలాంటి వర్గాలకు కీలక పదవుల్లో సముచిత స్థానం కల్పించాల్సిన అవసరం ఉందని నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో షేక్ సాధిఖ్‌కు జెడ్పీ చైర్మన్ పదవి కేటాయించడం ద్వారా ముస్లిం మైనారిటీలకు తగిన రాజకీయ గౌరవం లభిస్తుందని తెలిపారు.మైనారిటీల ఆకాంక్షలను గుర్తించి, వారి డిమాండ్‌పై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని, షేక్ సాధిఖ్‌కు జెడ్పీ చైర్మన్ పదవి కేటాయించే దిశగా నిర్ణయం తీసుకోవాలని ముస్లిం మైనారిటీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. కర్నూలు జిల్లా వ్యాప్తంగా దాదాపు 5 లక్షల ముస్లిం మైనార్టీ జనాభా ఉన్న గత వైసీపీ ప్రభుత్వం జిల్లాలో ముస్లిం మైనార్టీలకు రాజకీయంగా సముచిత స్థానం కల్పించలేదని ప్రస్తుతం దేవనకొండ జడ్పిటిసిగా కింద మెజారిటీతో గెలుపొందిన డాక్టర్ సాదిఖ కు జడ్పీ చైర్మన్ పదవి ఇస్తే ముస్లిం మైనార్టీలకు న్యాయం చేసినట్లు అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎం పి టి సి - 2 అబ్దుల్ సుబాన్, అహలే హదీస్ కమిటీ అధ్యక్షులు ముల్లా.సాదిక్,ఉపాధ్యక్షులు వలి, ఎస్ఎంసి చైర్మన్ శాలి షబ్బీర్,మైనార్టీ సీనియర్ నాయకులు ఆదం,ఖాదర్,సుబాన్, యూసుఫ్,శాలి.మహబూబ్ బాషా,వలి బాషా,సద్దాం, అతవుల్ల,జబ్బార్,జఫ్రుల్ల, ఫరూక్,ఇర్ఫాన్,మసూద్, తాహెర్,అబూబక్కర్,సుమామ, ముస్లిం మైనార్టీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల సేవలు వినియోగించుకోవాలి

- పిల్లలను రోజూ కేంద్రాలకు పంపాలి - జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



రాజన్న సిరిసిల్ల నవంబర్ 12 : అంగన్వాడీ కేంద్రాల సేవలు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. తంగళ్లపల్లి మండలం పద్మనగర్ అంగన్వాడీ కేంద్ర నిర్మాణ పనులు పూర్తికాగా గురువారం జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై భవనాన్ని ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రతి రోజూ తల్లిదండ్రులు బాధ్యతగా తమ పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు క్రమం తప్పకుండా పంపాలని సూచించారు. పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఇప్పటి నుంచే సరైన పోషకాహారం అందించాలని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు నిత్యం పంపించడంతో పిల్లలకు పోషకాహారం అందుతుందని, ఆట, పాటలు బొమ్మల ద్వారా విద్య బుద్దులు చెపుతారని వివరించారు. అంగన్వాడి కేంద్రాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారని కొనియాడారు.సామ్, మామ్ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. తీవ్రమైన పోషకాహార లోపం, మధ్యస్థ తీవ్ర పోషకాహార లోపం, తీవ్రమైన తక్కువ బరువు, మధ్యస్థ తక్కువ బరువు ఉన్న పిల్లలకు ప్రత్యేక శ్రద్ధ పెట్టి.. అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహారం అందిస్తారని వివరించారు. వారికి బాలామృతం ప్లస్ పంపిణీ చేస్తున్నామని తెలిపారు.ప్రతి మంగళవారం 10 నిమిషాలు కార్యక్రమాన్ని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. కేంద్రాల సేవలు, వసతులు మెరుగు పరచడం, పోషకాహారం పంపిణీ, బాలల హక్కుల రక్షణ, వసతుల పెంపు తదితర అంశాలపై కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రజలు పాల్గొనాలని సూచించారు కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, ఇంచార్జి తహసీల్దార్ మురళి, ఎంపీడీఓ రమేష్, సర్పంచ్ మోర నిర్మల తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఫరూక్‌ను కలిసిన నూతన ఎంపీపీ



నంద్యాల, బండిఆత్మకూరు మండలం జి.లింగాపురం ఎంపీటీసీగా భారీ మెజారిటీతో గెలుపొంది, నూతన ఎంపీపీగా ఎన్నికైన షేక్ సహిద గురువారం నంద్యాలలో రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛం అందించి గజమాలతో అభినందనలు తెలిపారు. నూతన ఎంపీపీగా ఎన్నికైన షేక్ సహిదను మంత్రి ఫరూక్ అభినందించి, మండల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ షేక్ బాబు, నాయకులు షేక్ ఫైజుల్లా, బాషా, రెహమాన్, సద్దాం తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్లలో కమిషనర్ తనిఖీలు

- పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి



నంద్యాల, : నంద్యాల పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ, ప్రజలకు అందుతున్న సేవలపై మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా గురువారం ఉదయం మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న పట్టణంలోని అన్న క్యాంటీన్లను తనిఖీ చేసి నిర్వహణ, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు.అనంతరం 13వ వార్డులోని బాలాజీ కాంప్లెక్స్ ప్రాంతంలో పారిశుద్ధ్య పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పరిసరాల్లో చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని, పారిశుద్ధ్య పనులను నిరంతరం పర్యవేక్షించాలని సిబ్బందికి సూచించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించరాదని ఆదేశించారు.ఈ తనిఖీల్లో మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు విక్రమ్, శభరిష్, శానిటేషన్ సూపర్‌వైజర్లు మురళీధర్, లక్ష్మీనారాయణ, శివప్రసాద్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణలో భారీగా ఐపీఎస్‌ల బదిలీలు

గ్రేహౌండ్స్, ఆర్టీసీ, మహిళా భద్రత విభాగాల్లో మార్పులు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ బదిలీల్లో భాగంగా హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా మహేష్ మురళీధర్ భగవత్ నియమితులయ్యారు. ఇప్పటివరకు హైదరాబాద్ సీపీగా బాధ్యతలు నిర్వహించిన వీసీ సజ్జనార్‌కు ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ విభాగం డీజీగా కొత్త బాధ్యతలు అప్పగించారు. దీంతో నగర పోలీస్ కమిషనరేట్‌లో కీలక మార్పు చోటుచేసుకుంది.

కీలక అధికారులకు కొత్త బాధ్యతలు

- మహేష్ భగవత్: హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్‌గా నియామకం.
- వీసీ సజ్జనార్: ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ డీజీగా బాధ్యతలు.
- చారు సిన్హా: అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) డీజీగా నియామకం. సీఐడీ అదనపు బాధ్యతలు కొనసాగింపు.
- డాక్టర్ అనిల్ కుమార్: తెలంగాణ ఆర్టీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా నియామకం.
- వై. నాగిరెడ్డి: పౌరసరఫరాల శాఖ కమిషనర్‌గా బాధ్యతలు.
- సౌమ్య మిశ్రా: మహిళా భద్రత, షీ టీమ్స్, భరోసా విభాగాల డీజీగా నియామకం.
- స్వాతి లక్రా: జైళ్ల శాఖ డీజీగా బాధ్యతలు.
- విక్రమ్‌సింగ్ మాన్: గ్రేహౌండ్స్, ఆక్టోపస్ డీజీగా నియామకం.
- స్టీఫెన్ రవీంద్ర: తెలంగాణ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్ అండ్ రైల్ సేఫ్టీ బ్యూరో డైరెక్టర్‌గా నియామకం.
- అకున్ సబర్వాల్: శాంతిభద్రతల అదనపు డీజీపీగా నియామకం.
- సంజయ్ కుమార్ జైన్: అదనపు డీజీపీ (ట్రైనింగ్) బాధ్యతలు.
- ఎస్. చంద్రశేఖర్ రెడ్డి: ఏసీబీ డైరెక్టర్‌గా నియామకం.
- కార్తికేయ: ఐజీపీ మల్టీ జోన్-1గా బాధ్యతలు.
- కె. రమేష్ నాయుడు: ఐజీపీ రైల్వేస్‌గా నియామకం.
- జోయల్ డేవిస్: జాయింట్ డైరెక్టర్‌గా బాధ్యతలు. హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు కొనసాగింపు.
- చందన దీప్తి: జోగులాంబ జోన్-7 డీఐజీగా అదనపు బాధ్యతలు.
- ఆర్. భాస్కరన్: డీఐజీ ఇంటెలిజెన్స్‌గా అదనపు బాధ్యతలు.
- కె. నారాయణ నాయక్: బాసర జోన్-2 డీఐజీగా అదనపు బాధ్యతలు.
- ఎల్.ఎస్. చౌహాన్: డీఐజీ కోఆర్డినేషన్‌గా నియామకం.
- బాలాదేవి: డిప్యూటీ డైరెక్టర్ (అడ్మినిస్ట్రేషన్)గా నియామకం.
- వి. అరవిందబాబు: హైదరాబాద్ డీసీపీ గా నియామకం.

పోలీస్ వ్యవస్థలో మార్పులపై ఆసక్తి

రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, అవినీతి నిరోధం, మహిళలు మరియు చిన్నారుల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ కీలక విభాగాల్లో అధికారుల మార్పులు చేపట్టినట్లు ఈ ఉత్తర్వుల ద్వారా స్పష్టమవుతోంది. ముఖ్యంగా హైదరాబాద్ వంటి ప్రధాన నగరానికి కొత్త పోలీస్ కమిషనర్ నియామకం కావడం, ఫైర్ అండ్ డిజాస్టర్ రెస్పాన్స్ విభాగానికి కొత్త డీజీ రావడం, ఏసీబీకి కొత్త నాయకత్వం అప్పగించడం ప్రాధాన్యత సంతరించుకున్నాయి. అదేవిధంగా ఆర్టీసీ, పౌరసరఫరాల శాఖల్లో సీనియర్ ఐపీఎస్ అధికారులకు బాధ్యతలు అప్పగించడం కూడా చర్చనీయాంశంగా మారింది.

ప్రజల్లో పెరుగుతున్న అంచనాలు

అధికారుల బదిలీలు కేవలం స్థానాల మార్పుకే పరిమితం కాకుండా ఆయా విభాగాల పనితీరులోనూ మార్పు తీసుకురావాలని ప్రజలు ఆశిస్తున్నారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుల పరిష్కారం, నేరాల నియంత్రణ, మహిళలకు భద్రత, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, అవినీతిపై కఠిన చర్యలు వంటి అంశాల్లో కొత్తగా బాధ్యతలు చేపట్టిన అధికారులు ఎలాంటి ఫలితాలు సాధిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

మన ఊరు మన సమస్యలు
బాగు చేసుకుందాం

- మాజీ జిల్లా ఉపాధ్యక్షులు చెన్న బసప్ప

కౌతాళం కౌతాళం మన గ్రామమని మన సమస్యలు మనమే బాగు చేసుకుని గ్రామ అభివృద్ధిని తోడ్పడుదామని గ్రామ అభివృద్ధికి లక్ష్యం అని గ్రామ ప్రజలు సహకరించాలని మాజీ జిల్లా ఉపాధ్యక్షులు ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ చెన్న బసప్ప తెలిపారు. మన గ్రామ అభివృద్ధి లక్ష్యంగా త్రాగు నీరు అందరికీ ఎంతో ఉపయోగకరమైనదని త్రాగు నీరు సమస్య తీర్చడానికి రెండు ట్యాంకులు సాధ్యమైనంత వరకు అధికారులు. నాయకులు మంత్రులు దృష్టి కి తీసుకోని వెళ్లి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. డ్రైనేజీలు సమస్యలు శాశ్వతంగా పరిష్కరిస్తామని విద్యుత్,విధి దీపాలు సమస్య లేకుండా కృషి చేస్తానని అన్నారు.మన ఊరి మన ఆడబిడ్డ, మా సతీమణి శ్రేయ సర్పంచు పోటీకి నిలబెడుతున్నారని మన ఊరి గ్రామ ప్రజలు అందరూ సహకరించి ఆదరించి ఆశీర్వదించలని కోరారు. ప్రజలందరికీ ఏకైక సమస్య స్మశాన వాటిక పోవటానికి రెండు కిలోమీటర్ల దూరం అవుతున్నది కావున మీరు మమ్మల్ని ఆదరిస్తే మా పొలం నుండి స్మశాన వాటిక దారి కల్పిస్తానని హామీ ఇస్తున్నాను అని తెలిపారు.పోలీస్ స్టేషన్, ఎంపీడీఓ, కార్యాలయం,ఆర్టీసీ బస్టాండ్ పంచాయతీ కార్యాలయం సొంత స్థలాలు గ్రామ అభివృద్ధి కొరకు విరాళాలు అందిచమని గుర్తు కు చేశారు.

ఐఆర్‌సీఎస్ సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలి

- సభ్యత్వ నమోదు మరింత పెంచాలి

- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

- ఐఆర్‌సీఎస్ మేనేజింగ్ కమిటీ సభ్యులతో కలెక్టర్ సమావేశం



రాజన్న సిరిసిల్ల:చర్చా వేదిక (నవంబర్ 12)ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ (ఐఆర్‌సీఎస్) ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టాలని ఆ సంస్థ జిల్లా అధ్యక్షురాలు, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. సమాజ సేవే లక్ష్యంగా పనిచేస్తూ, ప్రజలకు మరిన్ని సేవలు అందించేలా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు.గురువారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో ప్రణాళికాబద్ధంగా సేవా కార్యక్రమాలను చేపట్టాలని, సంస్థ సభ్యత్వ నమోదును మరింత పెంచాలని సూచించారు.అలాగే ఐఆర్‌సీఎస్ కార్యాలయం ఏర్పాటు, నూతన బ్లడ్ బ్యాంక్ నిర్మాణం, ఇతర సేవా కార్యక్రమాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు, కమిటీ సభ్యులకు సూచించారు. ప్రజలకు అవసరమైన సేవలను అందించడంలో రెడ్ క్రాస్ సొసైటీ మరింత చురుకైన పాత్ర పోషించాలని పేర్కొన్నారు.ఈ సమావేశంలో ఐఆర్‌సీఎస్ జిల్లా చైర్మన్ గూడూరి రవీందర్, వైస్ చైర్మన్ ప్రయాకరావు వేణు కుమార్, సెక్రటరీ సీహెచ్ సంతోష్ కుమార్, సలహాదారు ఈవీ శ్రీనివాసరావు, రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యుడు పీవీ సంజీవరెడ్డి, కోశాధికారి చంద్రగిరి శ్రీధర్, మేనేజింగ్ కమిటీ సభ్యులు ఎం. అజయ్ బాబు, ఏ. శివప్రసాద్, కే. బాబు, సీహెచ్ శ్రీనివాస్, దేవదాస్, అరుణ, రాజు, సురేంద్రబాబు, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సోనియాగాంధీ ఆత్మకథపై పీవీ కుమార్తె వాణీదేవి తీవ్ర విమర్శలు

- సోనియాగాంధీ ఆత్మకథపై స్పందించిన పీవీ కుమార్తె ఎమ్మెల్సీ -సురభి వాణీదేవి
- మాజీ ప్రధాని పీవీ అంత్యక్రియలు న్యూఢిల్లీలో ఎందుకు నిర్వహించలేదని ప్రశ్న
- స్వతంత్ర భారత చరిత్రలో ఏ ప్రధానికీ ఇలాంటి పరిస్థితి ఎదురుకాలేదన్న వాణీదేవి
- సోనియా జ్ఞాపకాల పుస్తకం అబద్ధాల పుట్ట అన్న పీవీ మనవడు ఎన్వీ సుభాష్

కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ ఆత్మకథ 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' విడుదలైన నేపథ్యంలో... మాజీ ప్రధాని దివంగత పి.వి. నరసింహారావు కుటుంబ సభ్యుల నుంచి తీవ్ర స్పందన వ్యక్తమైంది. పీవీపై సోనియాకు గౌరవమే ఉంటే ఆయన అంత్యక్రియలను దేశ రాజధాని ఢిల్లీలో ఎందుకు నిర్వహించలేదని పీవీ కుమార్తె, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి సూటిగా ప్రశ్నించారు. "సోనియాగాంధీ ఆత్మకథ 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' నేను ఇంకా చదవలేదు. కానీ తనకు పీవీతో ఎలాంటి విభేదాలు లేవని, ఆయనంటే ఎంతో గౌరవమని, తన అత్త, మాజీ ప్రధాని ఇందిర, భర్త రాజీవ్‌గాంధీకి అత్యంత ఆప్తుడని సోనియా ఆ పుస్తకంలో నిక్షిప్తం చేసినట్టు మీడియా ద్వారా విన్నాను. కానీ పార్టీకి, గాంధీ కుటుంబానికి సేవచేసిన, దేశ ప్రధానిగా పనిచేసిన పీవీ అంత్యక్రియలను ఢిల్లీలో జరపలేదెందుకు? స్వతంత్ర భారత చరిత్రలో ఏ ప్రధానికీ ఇలా జరగలేదు. దీనిని గౌరవంగా భావించాలా? అవమానమని అనుకోవాలా?" అంటూ ఆమె నిలదీశారు. మరోవైపు పీవీ మనవడు, బీజేపీ అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్ సైతం సోనియా పుస్తకంపై తీవ్రంగా స్పం దించారు. ఈ ఆత్మకథ అసత్యాల పుట్ట అని, చారిత్రక తప్పిదాలతో కూడి ఉందని ఆయన విమ ర్శిం చారు. కాంగ్రెస్ పార్టీకి, దేశానికి పీవీ నరసింహారావు అందించిన సేవలను పుస్తకంలో ఉద్దే శపూర్వకంగానే దాటవేశారని ఆరోపించారు. తమ కుటుంబ సభ్యులను మాత్రమే పైకి తెస్తూ, పార్టీ లోని ఇతర ముఖ్య నేతలను కించపరచడం గాంధీ కుటుంబానికి అలవాటేనని

రసవత్తరంగా పంచాయతీ పోరు

- ఏకగ్రీవం చేస్తే ఎకరం పొలం.. రూ.50 లక్షల ఆఫర్

పశ్చిమ గోదావరి జిల్లా: రాష్ట్రంలో స్థానిక సంస్థల హడావిడి కొనసాగుతూనే ఉంది.. ఇప్పటికే మున్సిపల్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు ముగిసిపోగా.. ఇక పంచాయతీ ఎన్నికలకు నిర్వహించేందుకు ఎలక్షన్ కమిషన్ సన్నాహాలు చేస్తోంది.. అయితే, పశ్చిమ గోదావరి జిల్లాలోని ఓ గ్రామంలో ఎన్నికల రాజకీయం ఆసక్తికరంగా మారింది. సర్పంచ్ ఎన్నికను ఏకగ్రీవం చేస్తే గ్రామానికి భారీగా నిధులు, ఆస్తులు ఇస్తామంటూ అభ్యర్థులు ముందుకు వస్తుండటం చర్చనీయాంశంగా మారింది. ఒక అభ్యర్థి ఏకంగా రూ.50 లక్షలు ఇస్తానని ప్రకటించగా.. మరో అభ్యర్థి ఎకరం పొలం ఇస్తానని ఆఫర్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. నరసాపురం మండలం తూర్పుతాళ్లు గ్రామ పంచాయతీ ఎన్నిక ప్రస్తుతం ఉత్కంఠగా మారింది. సర్పంచ్ పదవి కోసం పలువురు అభ్యర్థులు పోటీకి సిద్ధమవుతున్నారు. అయితే ఎన్నికలు జరిగితే లక్షల రూపాయలు ఖర్చవడమే కాకుండా, గ్రామంలో ఇప్పటివరకు కొనసాగుతున్న ఐక్యత దెబ్బతింటుందని గ్రామ పెద్దలు భావించారు. దీంతో ఎన్నికను ఏకగ్రీవం చేయాలనే ఆలోచనతో ముందుకు వచ్చారు. ఇందులో భాగంగా ఇటీవల పార్టీలకు అతీతంగా గ్రామ పెద్దలు సమావేశమయ్యారు. పోటీలో ఉన్న అభ్యర్థులతో చర్చలు జరిపారు. ఎన్నికల కోసం అనవసరంగా డబ్బు ఖర్చు చేయడం, గ్రామంలో వర్గ విభేదాలు పెంచుకోవడం కంటే అందరూ కలిసి ఏకగ్రీవంగా సర్పంచ్‌ను ఎన్నుకోవడం మంచిదని అభిప్రాయపడ్డారు. ఏకగ్రీవానికి సహకరించే అభ్యర్థులు గ్రామ అభివృద్ధికి ఎంతమేరకు సహకరిస్తారు? గ్రామంలోని ఆలయాలు, చర్చిలు, ఇతర ప్రార్థనా మందిరాలకు ఏమి చేస్తారు? అని పెద్దలు అభ్యర్థులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఒక అభ్యర్థి గ్రామానికి రూ.50 లక్షలు ఇస్తానని ముందుకు వచ్చినట్లు సమాచారం. మరో అభ్యర్థి ఏకంగా ఎకరం పొలం ఇస్తానని ప్రకటించినట్లు తెలుస్తోంది. దీంతో తూర్పుతాళ్లు పంచాయతీ ఎన్నికల వ్యవహారం మరింత ఆసక్తికరంగా మారింది. అభ్యర్థులు గ్రామానికి ఇచ్చే హామీలు ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. అయితే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత మరోసారి సమావేశమై తుది నిర్ణయం తీసుకోవాలని



గ్రామ పెద్దలు భావిస్తున్నారు. ఎవరైనా నామినేషన్ దాఖలు చేసినా వారితో మాట్లాడి ఉపసంహరించుకునేలా ప్రయత్నించాలని నిర్ణయించారు. ఏకాభిప్రాయం కుదరకపోతే ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలని కూడా భావిస్తున్నారు. ఈసారి తూర్పుతాళ్లు పంచాయతీ సర్పంచ్ పదవి ఓసీ జనరల్‌కు కేటాయించారు.

కూటమి పార్టీలకు మద్దతుగా ఉన్న ఈ గ్రామంలో ప్రస్తుతం ముగ్గురు అభ్యర్థులు పోటీకి సిద్ధమవుతున్నారు. గ్రామంలో ప్రశాంత వాతావరణం కొనసాగాలని, ప్రజల మధ్య ఐక్యత దెబ్బతినకూడదనే ఉద్దేశంతో పెద్దలు చేస్తున్న ఏకగ్రీవ ప్రయత్నం ఎంతవరకు ఫలిస్తుందో చూడాలి. నామినేషన్ల గడువు ముగిసిన తర్వాతే దీనిపై పూర్తి స్పష్టత రానుంది.

భూగర్భ జలాల పెంపునకు

ఇంకుడు గుంతలు తప్పనిసరి

- ఎంపీడీవో పుల్లారావు



నార్నూర్: వర్ష భావ పరిస్థితులను అధిగమించడానికి భూగర్భ జలాల పెంపునకు ఇంకుడు గుంతలు తప్పనిసరిగా నిర్మించాలని ఎంపీడీవో పుల్లారావు సూచించారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీవో అధ్యక్షతన మండల ఇస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు మండల ప్రగతిని వెల్లడించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో మండల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఎల్ నినో ప్రభావంతో నీటి జలాలు తగ్గుముఖం పట్టే అవకాశాలు ఉన్నాయని, నీటిని వృథా కాకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వృథా నీటిని అరికట్టేందుకు ఇంకుడు గుంతలు నిర్మించుకొవాలన్నారు. ప్రతి సమస్యను సమన్వయంతో పరిష్కరించి ప్రజలు ఇబ్బంది పడకుండా కృషి చేద్దామన్నారు. ఈ సమావేశంలో ఆర్డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్, ఎంపీఓ మహేష్, ఏవో ఆకాష్, ఆయా శాఖ అధికారులు, సర్పంచులు ఉన్నారు.

పవన్ కళ్యాణ్‌పై అసభ్యకర పోస్టులు.. వ్యక్తి అరెస్ట్

సోషల్ మీడియా పోస్టులపై పోలీసుల చర్య

గుంటూరు జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెడుతున్నాడనే ఫిర్యాదుతో గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం వడ్డేశ్వరానికి చెందిన కూరపాటి రవీంద్రబాబును పోలీసులు అరెస్ట్ చేశారు. గత నెల 13న పిఠాపురంలో జనసేన నాయకులు ఈ మేరకు ఫిర్యాదు చేశారు. పవన్ కళ్యాణ్ వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగించేలా, విద్వేషాలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు, వ్యంగ్యపూరిత క్యాప్షన్లతో పోస్టులు ప్రచారం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బుధవారం పిఠాపురం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద అతడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

టెక్ మహేంద్ర మాజీ ఉద్యోగి కాల్చివేత..



న్యూఢిల్లీ : టెక్ మహీంద్రా ఆసియా మాజీ హెడ్ పరమ్‌జీత్ ధన్‌కర్ ఫరీదాబాద్ లో తన పొరుగింటి వ్యక్తి జరిపిన కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. అయితే సీసీటీవీకి ఆ కాల్పుల ఘటన చిక్కింది. ఆ వీడియోను ఇప్పుడు పోలీసులు రిలీజ్ చేశారు. నిందితుడు మోనూ శర్మ, పరమ్‌జీత్ మధ్య పార్కింగ్ అంశంలో వాగ్వాదం జరిగినట్లు వీడియోలో ఉన్నది. పరమ్‌జీత్ మాట్లాడుతున్న సమయంలో.. గన్ తీసి మోనూ శర్మ ఫైరింగ్‌కు పాల్పడ్డాడు. పక్కనే ఉన్న పరమ్‌జీత్ కుమారుడు భయంతో పరుగులు తీశాడు. మోను తన లైసెన్స్‌డ్ తుపాకీతో 15 రౌండ్లు కాల్చగా, 9 తూటాలు పరమ్‌జీత్‌కు తగిలాయి. టీషర్ట్ ధరించిన మోనూ శర్మ తన ప్యాంటు జేబులో నుంచి గన్ తీసి అకస్మాత్తుగా ఫైరింగ్ చేశాడు. 5 సెకన్లలో మల్టిపుల్ రౌండ్లు కాల్చాడు. టెకీ మహేంద్ర మాజీ ఉద్యోగి పరుగులు తీస్తున్నా.. నిందితుడు శర్మ మాత్రం బుల్లెట్ల వర్షం కురిపించాడు. బిల్డింగ్ గేటు తీసి బాధితుడు తప్పించుకునే ప్రయత్నం చేసినా అతన్ని నిందితుడు వదిలిపెట్టలేదు. కుప్పకూలిన పరమ్‌జీత్ వద్దకు ఓ వృద్ధ మహిళ వచ్చి నిందితుడిని అడ్డుకునే ప్రయత్నం చేసింది. మళ్లీ గన్‌ను రీలోడ్ చేసిన మోనూశర్మ .. పరమ్‌జీత్‌పై కాల్పులు జరిపాడు. ఫైరింగ్ చేస్తున్న సమయంలో నిందితుడు హ్యాపీ దీపావళి, ముబారక్ అని అరిచాడు. అందర్నీ చంపేస్తా, అందర్నీ చంపాకే వెళ్లిపోతా అని గట్టిగా అరుస్తున్నట్లు వీడియోలో ఉన్నది. పరమ్‌జీత్ తన మేనల్లుడి వివాహానికి హాజరయ్యేందుకు సింగపూర్ నుంచి భారత్‌కు వచ్చారు. పరమ్‌జీత్ కుటుంబ సభ్యులకు, వారి పొరుగింట్లో ఉంటున్న మోను శర్మ కుటుంబ సభ్యులకు తరచూ గొడవలు జరిగేవి. గత శుక్రవారం రాత్రి కారు పార్కింగ్ విషయంలో పరమ్‌జీత్, మోను మధ్య ఘర్షణ జరిగింది. మోను తన లైసెన్స్‌డ్ తుపాకీతో 15 రౌండ్లు కాల్చగా, 9 తూటాలు పరమ్‌జీత్‌కు తగిలాయి. దీంతో ఆయన ప్రాణాలు విడిచారు. కార్ల పార్కింగ్, పెంపుడు కుక్క మూత్ర విసర్జన వంటి సాధారణ విషయాల్లో గొడవ పడేవారని తెలుస్తున్నది. రెండు రోజులకే మోనును అరెస్ట్ చేశారు. మోను భార్య, కుమార్తె, కుమారుడు, సోదరుడు నిందితులని ఫిర్యాదులో పేర్కొన్నారు.

తాగేందుకు, వంటకూ

రూ.20 ఫిల్టర్ డబ్బా నీళ్లే..

- మంత్రి వాకిటి శ్రీహరి ఇలాఖాలో నీటి కష్టాలపై మహిళ..

మక్తల్ మంత్రి వాకిటి శ్రీహరి ప్రాతినిధ్యం వహిస్తున్న ఏరియాలో ప్రజలు గుక్కెడు తాగునీటి కోసం రోడ్డెక్కాల్సిన పరిస్థితి వచ్చింది. మక్తల్ మున్సిపాలిటీ పరిధిలో కొద్ది రోజులుగా తాగునీళ్లు రావడం లేదంటూ జనాలు ఆందోళన బాట పట్టారు. కాలనీల్లో కొన్ని రోజులుగా కనీసం తాగు నీరు రావడం లేదంటూ నందిని నగర్ కాలనీ వాసులు మక్తల్?కర్ణి రహదారిపై బైఠాయించారు. దీనికి సంబంధించిన వీడియో రేవంత్ సర్కార్‌లో తాగునీటి కష్టాలు ఎలా ఉన్నాయో మరోసారి చెప్పకనే చెబుతోంది.ఓటేయించుకుని ఇటువైపు రావడం లేదు..: నిరసనలో పాల్గొన్న ఓ మహిళ మాట్లాడుతూ..నీళ్లు రాకపోవడంతో వంట చేయలేక రోడ్డుపై వచ్చి కూర్చున్నాం.. మాకు నీళ్లు కావాలే.. నీళ్లు లేకుంటే వంట చేసే పరిస్థితి లేదు.. ఎన్ని దినాలాయే.. 20 రూపాయల ఫిల్టర్ నీళ్ల డబ్బా తెచ్చుకుంటున్నం.. తాగేందుకు అవే.. వంట చేసేందుకు అవే.. లీడర్లు ఓట్లపుడు మా దగ్గరకు రాకుంటే ఇంట్లనే ఉండేవాళ్లం.. ఏదో ఒక ఆశ చెప్పి ఓటేయించుకుని ఇటువైపు రావడం లేదు.. మాకు నీళ్లు కావాలే.. మాకు చేసుకోవడానికి పనులు కూడా లేవని వాపోయింది.మేం అది చేస్తం.. ఇది చేపిస్తమని చెప్పి ఓట్లేయించుకున్నరు.. మేం ఆఫీసుల చుట్టూ తిరిగినా మమ్మల్ని ఎవరూ పట్టించుకోవడం లేదు.. 2 నెలల నుంచి మాకు సరిగ్గా నీళ్లే లేవు.. ఎన్ని రోజులు ఇలా మోసుకోవాలి మేము అంటూ మరో మహిళ ఆవేదన వ్యక్తం చేసింది.

మరో ఉద్యోగితో రిలేషన్..

- జేన్సన్ హువాంగ్‌పై వేటుకు ఎన్వీడియా బోర్డు సిద్ధం

న్యూఢిల్లీ: అమెరికా చిప్ తయారీ కంపెనీ ఎన్వీడియా సీఈవో జేన్సన్ హువాంగ్‌పై చర్యలు తీసుకునేందుకు ఆ కంపెనీ బోర్డు సిద్ధమైనట్లు ఓ నివేదిక ద్వారా వెల్లడైంది. చైనీస్ గూఢాచారితో పాటు మరో మహిళతోను సీఈవో జేన్సన్ వివాహేతర సంబంధం పెట్టుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తిన విషయం తెలిసిందే. త్వరలోనే కంపెనీ బోర్డు సభ్యులు సమావేశం కానున్నారని ఆ నివేదికలో వెల్లడైంది. ఒకవేళ హువాంగ్‌ను తప్పిస్తే, అప్పుడు సుమారు 4 ట్రిలియన్ల డాలర్ల చిప్ తయారీ కంపెనీ భవితవ్యం ఆగమ్యగోచరంగా మారనున్నది. జేన్సన్ అఫైర్ వార్తలు బయటకు పొక్కడంతో ఆ కంపెనీ షేర్లు అమాంతం 8 శాతం పడిపోయాయి. ఈ వారంలోనే ఆ కంపెనీ సుమారు 600 బిలియన్ల మార్కెట్ విలువను కోల్పోయింది. హువాంగ్‌ను తక్షణమే తొలగించలేని పరిస్థితిలో ఆ కంపెనీ ఉన్నది. ఎందుకంటే ఆయనకు వారసుడిగా ఎవర్ని ప్రకటించాలన్న దానిపై ఇంకా క్లారిటీ లేదు. ఒకవేళ కంపెనీ విధానాలను కానీ, చట్టాలను కానీ హువాంగ్ ఉల్లంఘించినట్లు రుజువైతే, దానికి తగిన ఆధారాలు ఉంటే, ఆయనపై చర్యలు తీసుకుంటామని టెక్నాలజీ రీసర్చ్ హెడ్ గిల్ లూరియా తెలిపారు. చైనీస్ గూఢాచారిణి అలిస్ హువాంగ్‌తో పాటు కంపెనీలో పనిచేసే ఓ ఎగ్జిక్యూటివ్ మహిళతోనూ హువాంగ్ రిలేషన్‌లో ఉన్నట్లు ఊహాగానాలు వ్యాపించాయి. ఎన్వీడియా హెల్త్‌కేర్‌లో వైస్ ప్రెసిడెంట్‌గా చేస్తున్న కింబర్లే పావల్‌తో జేన్సన్ రిలేషన్‌లో ఉన్నట్లు అమెరికా మీడియా తెలిపింది. దీనిపై వ్యక్తిగతంగా ఇద్దరూ స్పందించలేదు. అయితే తాజా ఆరోపణల నేపథ్యంలో జేన్సన్‌పై వేటుకు బోర్డు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్

కారు యాక్సిడెంట్



రంగారెడ్డి ప్రముఖ డ్యాన్స్ మాస్టర్ శేఖర్ మాస్టర్ కారు ప్రమాదానికి గురయింది. చిరంజీవి కాకా మూవీ షూటింగ్ ముగించుకుని హైదరాబాద్‌కు తిరిగి వెళ్తుండగా ఉదయం 6 గంటల సమయంలోప్రమాదం చోటు చేసుకుంది. శంషాబాద్ దగ్గరలోని ముచ్చింతల్ వద్ద శేఖర్ మాస్టర్ కారును పండ్ల లోడ్‌తో వెళ్తున్న వ్యాన్ ఢీకొట్టింది. అయితే శేఖర్ మాస్టర్, సిబ్బంది ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు.

కుప్పంలో ఏనుగుల హల్

పంటలు ధ్వంసం

చిత్తూరు కుప్పం మండలంలో ఏనుగుల గుంపు హల్ చల్ చేస్తోంది. గ్రామ సమీపాల్లో సంచరిస్తూ భయాందోళనకు గురిచేస్తోంది. మల్లంచెరువు, ఊరినాయనకొత్తురు సమీపంలో ఏనుగులు పంటలను ధ్వంసం చేశాయి. గ్రామస్థులు అధికారులకు పిర్యాదు చేసారు. అటవీశాఖ అధికారులు అప్రమత్తమై ఏనుగులను తమిళనాడు వైపు తరలిస్తున్నారు.

ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు నిరసన సెగ

ఆలేరు ఆలేరు వ్యవసాయ మార్కెట్ యార్డులో గత ప్రభుత్వం నిర్మించిన గోదామును ప్రారంభించేందుకు వచ్చిన బీర్ల ఐలయ్యకు రైతులనుంచి నిరసన సెగ తాకింది. ఇరవై రోజులుగా వడ్లు తడుస్తూ, ఎండుతూ ఉన్నా కొనుగోలు చేయడం లేదని రైతులు ఎమ్మెల్యే కు పిర్యాదు చేసారు. ఈ నేపథ్యంలో 20 రోజులుగా వడ్లు కొనడం లేదని బీర్ల ఐలయ్యను నిలదీసారు. భోజనం చేద్దామని పిలవగా, నేనే పది మందికి అన్నం పెడతానని బీర్ల ఐలయ్యకు ఒక రైతు సమాధానం ఇచ్చాడు.

కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని పాదయాత్ర

మహబూబ్‌నగర్ మూసాపేట మండలం తిమ్మాపూర్, జానంపేట గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, దేవరకద్ర ఎమ్మెల్యేగా ఆల వెంకటేశ్వర్ రెడ్డి తిరిగి గెలవాలని ఆకాంక్షిస్తూ కురుమూర్తి స్వామి దేవస్థానం వరకు 35 కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టారు.మార్గమధ్యంలో బీఆర్ఎస్ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. సాయంత్రం ఆలయానికి చేరుకున్న నాయకులు, కార్యకర్తలు కేసీఆర్, ఆల వెంకటేశ్వర్ రెడ్డి విజయాలను కాంక్షిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

హైదరాబాద్ నగరంలో మరో దారుణ హత్య



హైదరాబాద్ నగరంలో మరో మర్డర్ కేసు నమోదయింది. దుండగులు మహిళ నోట్లో గుడ్డలు కుక్కి, కాళ్లు కట్టేసి హతమార్చారు.మీర్‌పేట్ పరిధిలోని జిల్లెలగూడ దత్తునగర్‌లోని శ్రీలక్ష్మి రెసిడెన్సీలో నివాసం ఉంటున్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి అరుణ్ కుమార్ భార్య అనిత (35)ను దండగులు దారుణంగా హతమార్చారు. నోట్లో గుడ్డలు కుక్కి కాళ్లు కట్టేసి హతమార్చినట్టు పారిపోయారు. రక్తపు మడుగులో ఉన్న తల్లిని చూసిన పిల్లలు తండ్రి అరుణ్ కుమార్ కి సమాచారం ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తున్నారు.

రెండు లారీలు ఢీ..

ఒక డ్రైవర్ మృతి

ఏలూరు దెందులూరు శివారులోని గుండేరు వాగు సమీపంలో 16వ జాతీయ రహదారిపై గురువారం ఉదయం 6 గంటల సమయంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఏలూరు నుంచి రాజమండ్రి వెళ్తున్న పుల్లల లారీ(�ంఖ 16ఖ1699)ని, అదే దిశలో వెనుక నుంచి వచ్చిన మరో పుల్లల లారీ(ంఖ 27ఙ2484) బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో వెనుక లారీ డ్రైవర్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు

ఏపీ పెవిలియన్, ఎంఎస్ఎంఈ ప్రదర్శనను

వీక్షించిన మంత్రి లోకేష్

విశాఖపట్నం: సీఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా ప్లీనరీ హాల్ లో ఏర్పాటుచేసిన ఏపీ పెవిలియన్, ఎంఎస్ఎంఈ ప్రదర్శనను కేంద్ర మంత్రి పీయూష్ గోయల్, సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తో కలిసి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ వీక్షించారు. ఈ సందర్భంగా ఏపీ సాంస్కృతిక, కళారంగ వైభవాన్ని చాటిచెప్పేలా ఏర్పాటుచేసిన వివిధ స్టాళ్లను మంత్రి సందర్శించారు. అరకు కాఫీ రుచి చూశారు. రాజధాని అమరావతి టవర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తిరుపతి, విశాఖపట్టణం, అమరావతి ఎకనామిక్ రీజియన్లలో చేస్తున్న అభివృద్ధిని ఈ సందర్భంగా అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, ఎంపీలు శ్రీభరత్, కలిశెట్టి అప్పలనాయుడు, రాజ్యసభ ఎంపీ భాష్యం ప్రవీణ్, మంత్రి బీసీ జనార్థన్ రెడ్డి, ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 15 నుండి 18 వరకు నల్లగొండలో జరిగే

అఖిలభారత రైతు మహాసభలను జయప్రదం చేయండి...

- కుమ్మరికుంట్ల నాగన్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు...



మహబూబాబాద్ నవంబర్ 15 నుండి 18 వరకు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట కేంద్రమైన నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న అఖిలభారత కిసాన్ సభ (ఏఐకేఎస్) 36వ అఖిలభారత మహాసభల సందర్భంగా 15న జరిగే రైతు బహిరంగ సభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కుమ్మరి కుంట్ల నాగన్న పిలుపునిచ్చారు గురువారం నాడు సిఐటియు ఆధ్వర్యంలో పట్టణంలోని అన్ని హమాలి అడ్డల దగ్గర వ్యవసాయ మార్కెట్లో కరపత్రాలు పంచుతూ విస్తృతంగా ప్రచారం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా నాగన్న మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 1.58 కోట్లకు పైగా సభ్యత్వం తో అఖిలభారత కిసాన్ సభ ప్రపంచంలో నే అతిపెద్ద రైతాంగ ఉద్యమ సంస్థగా కొనసాగుతుంది అని అన్నారు రైతాంగ హక్కుల కోసం నిరంతరం పోరాడుతుందన్నారు దేశంలో బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులపై మూడు నల్ల చట్టాలు తీసుకురావడం జరిగిందని మండిపడ్డారు అదేవిధంగా కార్మికులపై పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్ గా తీసుకోవచ్చి కార్మిక హక్కులని కాల రాస్తుందన్నారు కాబట్టి 15 తారీకు నాడు జరగబోయే నల్లగొండలో రైతు సంఘం భారీ బహిరంగ సభకు హమాలీలు కూలీలు మున్సిపాలిటీ కార్మికులు గ్రామపంచాయతీ కార్మికులు సెక్యూరిటీ గార్డు బిల్డింగ్ రంగం కార్మికులు హెయిర్ బస్ కార్మికులు సోడా కార్మికులు స్ట్రీట్ వైన్డర్స్ కార్మికులు ఆ బహిరంగ సభలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు...ఈ కార్యక్రమంలో నవీను వెంకన్న సేవ్య బాలు హరి రవి హేమ జనార్ధన్ సారయ్య వెంకటేష్ రాజు మోహన్ కృష్ణ లక్ష్మణ్ కోటేష్ ఉపేందర్ రమేష్ సురేందర్ సుక్య యాకన్న లాలు సూర్య నాగరాజు రాజేష్ మదన్ గోపాల్ తదిరులు పాల్గొన్నారు

గుండ్లపోచంపల్లిలో ఘనంగా సదర్ వేడుకలు



మేడ్చల్(ప్రశ్న న్యూస్)మేడ్చల్ సర్కిల్ గుండ్లపోచంపల్లి డివిజన్ పరిధిలోని గుండ్లపోచంపల్లి గ్రామంలో యాదవ సంఘం అధ్యక్షులు నర్సింగ్ యాదవ్ ఆధ్వర్యంలో సదర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్ మాజీ జడ్పీటీసీ ,గుండ్లపోచంపల్లి 299 డివిజన్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ సాయిపేట శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సదర్ వేడుకల ప్రాముఖ్యతను, యాదవుల సంస్కృతి సంప్రదాయాలను కొనియాడారు. సదర్ వేడుకలు యాదవుల ఐక్యతకు, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఇలాంటి సంప్రదాయ పండుగలను ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గుండ్లపోచంపల్లి 299 డివిజన్ ఎస్సి అధ్యక్షులు కుండ భానుచందర్, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లేష్, మలిగే కిషోన్, నందు యాదవ్, వడ్డె ప్రవీణ్, ఆలయ కమిటీ డైరెక్టర్ బండారి అనిల్, హర్ష, బాలరాజ్ గౌడ్, బండారి వెంకట్,ప్రసాద్,షబ్బీర్, వినోద్, సంపత్ గౌడ్,మాజీ వార్డ్ సభ్యులు మహిపాల్ రెడ్డి, సోంగారి సత్తి రెడ్డి,మరియు యాదవ సంఘం నాయకులు, సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

గ్లోబల్ సమ్మిట్ వాయిదా వేయండి

తెలంగాణ ప్రజల కూటమి బహిరంగ విజ్ఞప్తి



మేడ్చల్ (ప్రశ్న న్యూస్)ఎల్ నినో ప్రేరిత కరువు, తీవ్ర నీటి సంక్షోభం నేపథ్యంలో డిసెంబర్ 7 నుంచి 9 వరకు నిర్వహించ తలపెట్టిన 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026' ను వెంటనే వాయిదా వేయాలని కోరుతూ తెలంగాణ పీపుల్ కోయలిషన్ ఫర్ ఎల్ నినో క్రైసిస్ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి బహిరంగ విజ్ఞప్తి సమర్పించింది.ఆందోళన చెందుతున్న పౌరులు, పౌర సమాజ సంస్థలు, విద్యావేత్తలు, ప్రజా సంస్థల తరపున ఈ విజ్ఞప్తిని సమర్పించినట్లు కూటమి ప్రతినిధులు తెలిపారు.31 జిల్లాల్లోని 365 మండలాల్లో కరువు ప్రకటిస్తూ అక్టోబర్ 24న ప్రభుత్వం జారీ చేసిన జీవో ఎంఎస్ నెం.3 నేపథ్యంలో రాష్ట్రం అత్యవసర పరిస్థితిలో ఉందని విజ్ఞప్తిలో పేర్కొన్నారు. అక్టోబర్ 15న ముఖ్యమంత్రి స్వయంగా ఎల్ నినో పరిస్థితిని కోవిడ్-19 విపత్తుతో పోల్చారని, వరి వంటి నీటిని ఎక్కువ వినియోగించే పంటలు వేయవద్దని రైతులకు విజ్ఞప్తి చేశారని, 2027 జూలై వరకు తాగునీటి సంక్షోభం కొనసాగవచ్చని హెచ్చరించారని గుర్తుచేశారు.ఈ నేపథ్యంలో పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటించడం, నీరు లేక ప్రభుత్వ హాస్టళ్లు మూతపడటం, ఐటీ రంగం వర్క్ ఫ్రమ్ హోమ్ వైపు వెళ్లడం, హైదరాబాద్‌లోని అనేక ప్రాంతాల్లో 3-4 రోజులకు కొన్ని లీటర్ల నీరు మాత్రమే రావడం వంటి పరిస్థితులు ఉన్నాయని కూటమి వివరించింది.ఇటువంటి సమయంలో హైదరాబాద్ సమీపంలోని భారత్ ఫ్యూచర్ సిటీలో 4 వేల మంది ప్రతినిధులతో, ప్రపంచ స్థాయి ఫైవ్ స్టార్ సౌకర్యాలతో సమ్మిట్ నిర్వహించడం సామాన్య ప్రజల పట్ల సున్నితత్వం కాదని, అమానవీయమని విజ్ఞప్తిలో ఆవేదన వ్యక్తం చేశారు. హోటళ్లు, విందులు, లాండ్రీ, పారిశుధ్యం, విద్యుత్, రవాణా కోసం భారీగా నీరు, శక్తి వినియోగం జరుగుతుందని, ఇది కరువు సమయంలో వనరుల పరిరక్షణకు విరుద్ధమని పేర్కొన్నారు.ప్రతి ప్రతినిధికి ఒక అధికారిని కేటాయించడం వల్ల కరువు సహాయక చర్యలకు అధికార యంత్రాంగం దూరమవుతుందని, జిల్లా, మండల అధికారులు, మున్సిపల్, లైన్ శాఖల సిబ్బంది అంతా కరువు నివారణ, నీటి సరఫరా సమన్వయం, ఫిర్యాదుల పరిష్కారంలోనే నిమగ్నమై ఉండాలని డిమాండ్ చేశారు.పరిస్థితి సాధారణ స్థితికి వచ్చి, కరువు జీవో అమలులో లేని వరకు సమ్మిట్‌ను వాయిదా వేసి, అన్ని ఆర్థిక, పరిపాలనా, మానవ వనరులను కరువు నివారణ, ప్రజల జీవనోపాధి పరిరక్షణ వైపు మళ్లించాలని కూటమి ముఖ్యమంత్రిని కోరింది.ఇటీవల హైదరాబాద్‌లో ఎల్ నినో సంక్షోభంపై నిర్వహించిన రోజు వారీ సంప్రదింపుల ఆధారంగా ఆదివాసీ, గ్రామీణ, పట్టణ సందర్భాలలో తీసుకోవాల్సిన తక్షణ, దీర్ఘకాలిక చర్యలపై స్వతంత్ర నివేదికను త్వరలో ముఖ్యమంత్రికి అందజేస్తామని కూటమి తెలిపింది.

గోసాయిగూడ లో భూముల రీ-సర్వే పాల్గొన్న జిల్లా అదనప కలెక్టర్ విజేందర్ రెడ్డి



మేడ్చల్(ప్రశ్న న్యూస్)మేడ్చల్ మండలం, గోసాయిగూడ గ్రామంలో జరుగుతున్న భూముల రీ-సర్వే పనులను ఈరోజు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. విజయేందర్ రెడ్డి క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన రీ-సర్వే ప్రక్రియ జరుగుతున్న తీరును, హద్దుల గుర్తింపు రికార్డుల నమోదు వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. భూముల రీ-సర్వే పనులను అత్యంత పారదర్శకంగా, ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు మరియు సర్వే బృందానికి అదనపు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు.ఈ పర్యటనలో మేడ్చల్ తహసీల్దార్ భూపాల్, గ్రామ పరిపాలనా అధికారి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రేగు రాజు సర్వే బృందం సభ్యులు పాల్గొన్నారు.

మేడ్చల్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల ఎఫెక్ట్

ఐదుగురికి జైలు శిక్ష, జరిమానాలు



మేడ్చల్(ప్రశ్న న్యూస్) మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై మేడ్చల్ ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు కొనసాగిస్తున్నారు. మేడ్చల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన మొత్తం 8 ట్రాఫిక్ ఉల్లంఘన కేసులను పోలీసులు గురువారం మేడ్చల్‌లోని ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి-కమ్- ఏడవ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. కేసులను విచారించిన న్యాయస్థానం నిందితులకు జైలు శిక్షలతో పాటు జరిమానాలు విధిస్తూ తీర్పు వెలువరించింది. డ్రంక్ అండ్ డ్రైవ్ కింద నమోదైన 6 కేసులలో ఐదుగురికి జైలు శిక్ష పడగా, మొత్తం రూ. 4,500 జరిమానా విధించారు. జైలు శిక్ష పడిన వారిలో ఒకరికి 10 రోజుల జైలు శిక్ష, మరో నలుగురికి 4 రోజుల చొప్పున జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన 2 కేసులలో నిందితులకు మొత్తం రూ. 2,000 జరిమానా విధించారు. ఈ సందర్భంగా మేడ్చల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ క్రాంతి కుమార్ వాహనదారులకు కీలక సూచనలు చేశారు. వాహనదారులు ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, డ్రైవింగ్ చేసే సమయంలో తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని స్పష్టం చేశారు. ప్రజల ప్రాణ రక్షణ దృష్ట్యా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించి పోలీసులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

డిసెంబర్ నాటికి ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం పూర్తి కావాలి

- అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) జూన్ 2 నాటికి అన్ని టిమ్స్ను అందుబాటులోకి రావాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. డిసెంబర్ వరకు ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం పూర్తికావాలని సూచించారు. మూడు టిమ్సుకు ఒకేసారి నియామకాలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. వాటి ఉద్యోగుల బదిలీలు జరిగేలా ఉండాలన్నారు. టిమ్స్ హౌస్ కీపింగ్ను పూర్తిగా ఔట్సోర్సింగ్కు ఇవ్వాలన్నారు. నిమ్స్ లో బెడ్స్ ఖాళీ లేక పోతే రోగులను సనత్ నగర్ టిమ్స్ కు తరలించాలని సూచించారు. నిమ్స్,టిమ్స్ మధ్య సమన్వయం ఉండాలని అధికారులకు స్పష్టం చేశారు. సనత్ నగర్ టిమ్స్ లో డాక్టర్ల నియామకమయ్యే వరకు బయట నుంచి నియమించుకోవాలని అధికారులకు సూచించారు. టిమ్స్, ప్రభుత్వ వైద్య కళాశాలలకు అదనంపు నిధులు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధమని తెలిపారు.

పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధం...

- శాంతియుత నిర్వహణకు కట్టుదిట్టమైన భద్రత !

- పల్నాడు జిల్లా ఎస్పీ జగదీష్ ఆదహల్లి



నరసరావుపేట, పంచాయతీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పల్నాడు జిల్లా ఎస్పీ జగదీష్ ఆదహల్లి పాల్గొన్నారు. ఎన్నికలను పూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పోలీస్ యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉందని జిల్లా ఎస్పీ తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని, సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచి ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రజలు భయాందోళనలు లేకుండా నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్పీ కోరారు.

ఎన్నికల నిర్వహణకు కలెక్టర్ దిశానిర్దేశం

- 19న కోఆప్షన్ సభ్యులు, ఉపాధ్యక్షుల ఎన్నికలు

నంద్యాల నవంబర్ 12: మండల ప్రజా పరిషత్ కోఆప్షన్ సభ్యులు, ఉపాధ్యక్షుల ఎన్నికలను నిబంధనల ప్రకారం పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారులు, ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నవంబర్ 19న సంబంధిత మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నవంబర్ 14లోపు సభ్యులకు ఎన్నికల నోటీసులు అందజేయాలని ఆదేశించారు. ఎన్నికల రోజున ఉదయం 10 గంటలలోపు నామినేషన్లు స్వీకరించి, 10 నుంచి 11 గంటల వరకు పరిశీలన చేపట్టాలన్నారు.అనంతరం మధ్యాహ్నం 1 గంటకు సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించి, కోఆప్షన్ సభ్యుల ఎన్నిక పూర్తి చేయాలని సూచించారు. ఆ తర్వాత ఉపాధ్యక్షుల ఎన్నిక నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఎన్నికల ప్రక్రియలో సమయపాలన పాటిస్తూ, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అన్ని రికార్డులను పక్కాగా నిర్వహించాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో సీఈవో శివశంకర్, జెడ్పీ సీఈవో సుబ్బారెడ్డి, డీఎల్‌డీవో శివారెడ్డి పాల్గొన్నారు.

దళితులను కించపరిస్తే సహించేది లేదు

కమాన్‌పూర్ : దళితులను కులం పేరుతో కించపరిస్తే సహించేది లేదని దళిత సంఘాల నాయకులు హెచ్చరించారు. కులం పేరుతో దళితులను అవమానించడం, కించపరచడం హేయమైన చర్య అని తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుక్క చంద్ర మొగిలి, దళిత సంఘాల సీనియర్ నాయకుడు చిప్పకుర్తి సత్యనారాయణ అన్నారు. గురువారం కమాన్‌పూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట దళిత సంఘాల నాయకులు విలేకరులతో మాట్లాడారు.రాజకీయంగా దళితులు ఎదుగుతున్న సమయంలో వారిని లక్ష్యంగా చేసుకుని అవమానాలకు గురిచేయడం సరికాదన్నారు. ఇటీవల వివిధ ప్రాంతాల్లో దళిత సర్పంచులు, ప్రజాప్రతినిధులపై జరుగుతున్న అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. కులం పేరుతో దూషించే వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సామాజిక మాధ్యమాల్లో దళితులను కించపరుస్తూ వైరల్ అవుతున్న వ్యాఖ్యలపై పోలీసులు తక్షణమే స్పందించి బాధ్యులను గుర్తించి అరెస్టు చేయాలని కోరారు.దళితులు చిన్న తప్పు చేసినా వెంటనే చర్యలు తీసుకునే యంత్రాంగం, దళితులను అవమానించిన వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. జిల్లాలోని పలు ప్రాంతాలతో పాటు రాష్ట్రంలోని వివిధ గ్రామాల్లో దళితులపై వివక్ష, అవమానకర ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించి బాధితులకు న్యాయం చేయాలన్నారు.దళితుల ఆత్మగౌరవానికి భంగం కలిగించే ఘటనలను ఇకపై సహించబోమని, న్యాయం జరిగే వరకు మాల, మాదిగ సహా అన్ని దళిత సంఘాలు ఐక్యంగా రాష్ట్రవ్యాప్తంగా పోరాటం కొనసాగిస్తాయని హెచ్చరించారు. అవసరమైతే రాజకీయ బహిష్కరణకు కూడా వెనుకాడబోమని స్పష్టం చేశారు.కార్యక్రమంలో దళిత నాయకులు , పులిపాక బొందియాలు, పిల్లి నరసింగం, పొట్ల శంకర్, చిప్పకుర్తి శివలింగం, ఈదునూరి సురేష్, ఆరెల్లి రాజు, ఆవునూరి ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన బొగ్గును సరఫరా చేయడం ద్వారానే

సంస్థ మనుగడ సాధ్యం

- ఆర్జీ జీఎం లలిత్ కుమార్

గోదావరిఖని : ప్రస్తుత పోటీ మార్కెట్‌లో వినియోగదారులకు నాణ్యమైన బొగ్గును సరఫరా చేయడం ద్వారానే సంస్థ మనుగడ సాధ్యమవుతుందని ఆర్జీ-1 జీఎం లలిత్ కుమార్ అన్నారు. రామగుండం ఏరియా-1 జీఎం కార్యాలయంలో క్వాలిటీ విభాగం ఆధ్వర్యంలో గురువారం బొగ్గు నాణ్యత వారోత్సవాలుప్రారంభమయ్యాయి. క్వాలిటీ అవగాహన కరపత్రాలను పంపిణీ చేసి ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గనుల్లో బొగ్గు వెలికితీసే సమయంలో బండ, మట్టి, షేల్ లేయర్లను వేరుచేస్తూ మంచి గ్రేడ్ బొగ్గును లోడింగ్ చేయాలని సూచించారు. ఇప్పటికే జిడికె-2ఏ భూగర్భ గనిలో షేల్ లేయర్‌ను వేరు చేస్తూ నాణ్యతను పెంచుకున్నారని తెలిపారు. జిడికె-1 ఇంక్లైన్‌లో మంచి నాణ్యత గల బొగ్గును అందిస్తుండటంతో స్థానిక వినియోగదారులు పోటీపడి మరీ రోజుకు సుమారు 500 టన్నుల బొగ్గును కొనుగోలు చేస్తున్నారని అభినందించారు. ప్రతి పని ప్రదేశంలో సూపర్‌వైజర్ నుంచి షావెల్ ఆపరేటర్ వరకు అందరూ సమష్టి కృషితో తమ బాధ్యతలను నిర్వర్తిస్తేనే నాణ్యత ప్రమాణాలను మరింత పెంచగలమని పేర్కొన్నారు. ఆర్జీ రీజియన్ క్వాలిటీ జీఎం వెంకటరమణ మాట్లాడుతూ ప్రైవేటు బొగ్గు ఉత్పత్తి సంస్థలు తక్కువ ధరలకు బొగ్గును విక్రయిస్తున్న నేపథ్యంలో, తీవ్రమైన మార్కెట్ పోటీని తట్టుకుని వినియోగదారులను కాపాడుకోవాలంటే నాణ్యత ఒక్కటే మార్గమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలోఎస్ఓటు జీఎం కె. చంద్రశేఖర్, ఏజీఎం కాశీ విశ్వేశ్వరరావు, యస్.ఓ.యం బ్రహ్మాజీ రావు, డీజీఎం ధనలక్ష్మి బాయి, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి అధికారులు మోహన్ రావు, కర్ణ, వేణు, సురేష్, సి.ఎం.ఓ.ఏ.ఐ ప్రతినిధి క్రాంతి కుమార్, ఏఐటీయూసీ ప్రతినిధి ఇజ్జగిరి రాజు తో పాటు వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు

ఈనెల 19న కొలిమిగుండ్ల ఎంపీపీ ఎన్నిక...



కొలిమిగుండ్ల కొలిమిగుండ్ల మండలంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 19న ఎంపీపీ ఎన్నిక ఉన్నట్లు ఎంపీడీవో దస్తగిరి బాబు ఇవాళ ఒక ప్రకటనలో తెలిపారు. కొలిమిగుండ్ల మండలంలో మొత్తం 15 మంది ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. ప్రతి ఎంపీటీసీ సభ్యుడు ఈనెల 19న ఎంపీడీవో కార్యాలయం వద్దకు చేరుకోవాలని ఆయన అన్నారు. ఈనెల 19న ఉదయం 11 గంటలకు ముందుగా కో ఆప్షన్ సభ్యుడిని సభ్యులచేత ఎన్నుకుంటారు. అనంతరం ఎంపీటీసీ సభ్యుల చేత రిటర్నింగ్ అధికారి హరినాథరెడ్డి ప్రమాణ స్వీకారం చేయిస్తారు. ఆ తర్వాత ఎంపీటీసీ సభ్యులందరూ కలిసి ఎంపీపీని ఎన్నుకుంటారని ఎంపీడీవో దస్తగిరి బాబు పేర్కొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అమలు



రాజన్న సిరిసిల్ల నవంబర్ 12 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్నదని, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అమలు చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. వేములవాడ నియోజకవర్గ స్థాయి చేయూత నూతన పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని వేములవాడ పట్టణంలోని ఫంక్షన్ హాల్ లో నిర్వహించగా, ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. ముందుగా జయ జయహే తెలంగాణ గీతంతో ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి రోజూ సుమారు 18 గంటలు శ్రమిస్తూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని పేర్కొన్నారు. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఈ నెల 19వ తేది నుంచి కొత్తగా మంజూరైన పెన్షన్ల నగదు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. జిల్లాలో కొత్తగా 8,209 పెన్షన్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు.ఇప్పటికే జిల్లాలో 1,13,264 మందికి పెన్షన్లు అందుతున్నాయని, కొత్తగా మంజూరైన పెన్షన్లతో కలిపి మొత్తం 1,21,473 మందికి ప్రతి నెలా పెన్షన్లు అందనున్నాయని వివరించారు. ఇందుకోసం ప్రతి నెలా సుమారు రూ.25.97 కోట్ల నిధులను ప్రభుత్వం వెచ్చించనుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ లాంటి పథకాలను కొనసాగిస్తూ, ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఒకవైపు సంక్షేమ పథకాల ద్వారా పేదలకు అండగా నిలుస్తూ, మరోవైపు మౌలిక సదుపాయాల కల్పనతో రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు (తలసేమియా, సికిల్ సెల్, హిమోఫీలియా) గీత కార్మికులు, నేత కార్మికులు, ఫైలేరియా, డయాలసిస్ బాధితులు నుంచి ఇప్పటికే దరఖాస్తుదారులు స్వీకరించామని తెలిపారు. అర్హుల ఎంపిక కోసం అధికారులతో విచారణ చేయించామని పేర్కొన్నారు. ఆగస్టు 01 వ తేదీ నుంచి సెప్టెంబర్ 15వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించామని, ఆయా దరఖాస్తులను అధికారులు విచారణ చేయించామని తెలిపారు. ఈ నెల 18 వ తేదీ వరకు మంజూరు పత్రాలు అందిస్తామని పేర్కొన్నారు. 19వ తేదీన తర్వాత లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలో డబ్బులు జమ అవుతాయని వెల్లడించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, వారి పేరిట ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నామని, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా మౌలిక వసతులు కల్పించే పనులు చేయిస్తున్నామని పేర్కొన్నారు. మహిళా సంఘాల ద్వారా స్కూల్ విద్యార్థులకు యూనిఫాంలు కుట్టించే బాధ్యత అప్పగించామని తెలిపారు. వయోవృద్ధుల సంరక్షణ కోసం ప్రభుత్వ చట్టం చేసిందని, త్వరలో అమలు కానున్నదని పేర్కొన్నారు.కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్లు రొండి రాజు, చెలుకల తిరుపతి, కచ్చకాయల ఎల్లయ్య, ఫ్యాక్స్ చైర్మెన్లు వకులాభరణం శ్రీనివాస్, బొమ్మేన భాస్కర్, ఏగోలపు శ్రీనివాస్, గనికంటి ప్రభాకర్, పిల్లి కనకయ్య,ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ మున్సిపల్ కమిషనర్ లోకేష్, తహసీల్దార్ జయంత్ తదితరులు పాల్గొన్నారు

'పుష్పక విమానం' (జియో హాట్ స్టార్) సిరీస్ రివ్యూ!



టైమ్ ట్రావెల్ కాన్సెప్ట్ తో గతంలో చాలానే సినిమాలు .. సిరీస్ లు వచ్చాయి. అలాంటి ఒక కాన్సెప్ట్ తో వచ్చిన సినిమానే 'పుష్పక విమానం'. సాయిరోనక్ ప్రధానమైన పాత్రను పోషించిన ఈ సిరీస్ కి భరణి శంకర్ కీలకమైన పాత్రను పోషించాడు. సతీశ్ మల్లిడి దర్శకత్వం వహించిన ఈ సిరీస్, ఈ రోజు నుంచే 'జియో హాట్ స్టార్' ఓటీటీ ట్రాక్ పైకి అడుగుపెట్టింది. ప్రస్తుతం 4 ఎపిసోడ్స్ ను వదిలారు. ఇకపై ప్రతి గురువారం కొత్త ఎపిసోడ్స్ ప్రేక్షకులను పలకరించనున్నాయి. 'పుష్పక్' (సాయి రోనక్) ఒక మిడిల్ క్లాస్ కుర్రాడు. చిన్నప్పటి నుంచి చదువు పెద్దగా వంటబట్టకపోయినా, మొత్తానికి ఒక ఇన్సూరెన్స్ కంపెనీలో జాబ్ సంపాదిస్తాడు. మాటకారి కావడంతో పాలసీలు చేయించడంలో మిగతా వాళ్లకంటే చాలాముందుంటాడు. అతని స్పీడ్ ను అందుకోవడానికి మిగతా వాళ్లంతా నానా తిప్పలు పడుతుంటారు. జాబ్ తరువాత పుష్పక్ ఎక్కువగా ఆలోచన చేసేది 'సావిత్రి' (మధు దామరాజు) గురించే. ఆమె ఆ ఊరు పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్ గా పనిచేస్తుంటుంది. 'పుష్పక్' పై సావిత్రి చాలా కోపంగా ఉంటుంది. ఎనిమిదేళ్లుగా అతను ఎంతగా బ్రతిమాలుతున్నా ఆమె అలాగే భీష్మించుకుంటుంది. ఛాన్స్ ఉంటే గతంలోకి వెళ్లి, తాను చేసిన పొరబాటును సరిదిద్దాలని అతనికి ఉంటుంది. ఇక పుష్పక్ తమ్ముడు 'సంకేత్' కూడా 'సారా' ప్రేమలో ఉంటాడు. ఇద్దరూ కలిసి ఒకే ఆఫీసులో పనిచేస్తూ ఉంటారు. 'సారా' శ్రీమంతుల అమ్మాయి. అయినా సంకేత్ ధైర్యం చేసి, ఆమె తండ్రికి తమ ప్రేమ విషయం చెబుతాడు. అక్కడ జరిగిన అవమానంతో అతను కంగుతింటాడు. బాగా డబ్బు సంపాదించి తిరిగొస్తానని సవాల్ చేసి వెనుదిరుగుతాడు. ఇక పుష్పక్ ఉంటున్న 'డార్విన్' కాలనీని ఖాళీ చేయించడానికి కొన్ని పెద్ద తలకాయలు ప్రయత్నిస్తూ ఉంటాయి. వాళ్లకి సపోర్టుగా పోలీస్ ఆఫీసర్ 'ప్రభు' ఉంటాడు. ఇలాంటి పరిస్థితులలో ఒక అజ్ఞాత వ్యక్తి (భరణి శంకర్) పుష్పక్ కి తారసపడతాడు. కాలనీ చివరో ఉన్న ఒక పాడుబడిన బిల్డింగ్ కి వెళ్లమని చెబుతాడు. అక్కడి 'లిఫ్ట్' అతని జీవితాన్ని మారుస్తుందని అంటాడు. ఆ మాటలను లైట్ తీసుకున్న పుష్పక్, అనుకోకుండానే ఆ రాత్రి అక్కడికి చేరుకుంటాడు. ఆ లిఫ్ట్ కీ చాలా కాలం క్రితం ఆ ప్రదేశాన్ని తాకిన ఉల్కా శకలానికి మధ్య సంబంధం ఉందనే సంగతి అతనికి తెలియదు. ఆ లిఫ్ట్ లోకి అడుగుపెడితే, అది తనని గతంలోకి తీసుకు వెళుతుందని కూడా అతనికి తెలియదు. గతంలోకి వెళ్లిన అతను ఏం చేస్తాడు? పుష్పక్ పై సావిత్రికి కోపం రావడానికి కారణం ఏమిటి? ఆ కాలనీని ఖాళీ చేయించాలనుకున్నవారిని పుష్పక్ ఎలా ఎదుర్కొంటాడు? ఒక వైపున తన ప్రేమకథపై దృష్టి పెడుతూనే, మరో వైపున తన తమ్ముడి ప్రేమకథను సక్సెస్ చేయడానికి పుష్పక్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటాడు? అనేది మిగతా కథ. జీవితం ఎప్పటికప్పుడు అనేక అనుభవాలతో .. జ్ఞాపకాలతో ముందుకు సాగిపోతూనే ఉంటుంది. ఈ ప్రయాణంలో తప్పులు .. పొరపాట్లు చేయనివారినంటూ ఎవరూ ఉండరు. ఆ తరువాత వాటిని తలచుకుని బాధపడని వారు కూడా ఉండరు. అలాంటి వాళ్లంతా కూడా కాలంలో వెనక్కి వెళ్లే ఛాన్స్ వస్తే, ఆ పొరపాట్లను దిద్దుకోవాలని అనుకుంటారు. అయితే అరుదైన అలాంటి ఛాన్స్ దక్కించుకున్న కథానాయకుడి చుట్టూ తిరిగే కథ ఇది. హీరో ముందు కొన్ని సవాళ్లు ఉంటాయి. తాను ప్రేమించిన అమ్మాయిని కూల్ చేయాలి. తన ఫ్యామిలీ పొజీషన్ మార్చాలి .. తన తండ్రి గర్వపడేలా చేయాలి .. తన తమ్ముడి ప్రేమ కూడా సక్సెస్ అయ్యేలా చూడాలి .. తమ కాలనీని కాపాడుకోవాలి. ఇలా అనేక బాధ్యతలు హీరో భుజాలపై ఉంటాయి. ఆ బాధ్యతలను నిర్వహించడంలో అతనికి ఎదురయ్యే సవాళ్ల చుట్టూ దర్శకుడు ఈ కథను అల్లుకుంటూ వెళ్లాడు. ఈ కథలో కీలకమైన అంశం హీరో .. లిఫ్ట్ లోకి అడుగు పెట్టడం. అది 4వ ఎపిసోడ్ చివర్లో జరుగుతుంది. అప్పటి వరకూ జరిగిన కథను చూసుకుంటే, పెద్దగా విషయం లేని సన్నివేశాలే కనిపిస్తాయని చెప్పాలి. హీరో పాత్ర చాలా యాక్టివ్ గా ఉంటుంది. కానీ మిగతా పాత్రలు .. ట్రాకులు నిరాశగా ... నిరుత్సాహంగా సాగుతుంటాయి. అటు హీరో జాబ్ కి .. ఇటు చిటపటలాడే హీరో లవర్ గురించిన విషయాలతో కథ అక్కడక్కడే తిరుగుతూ ఉంటుంది. హీరో ఆఫీసుకి సంబంధించిన సన్నివేశాలు గానీ .. ఫ్రెండ్ కాంబినేషన్లో హీరో సీన్స్ గాని పెద్దగా ఆకట్టుకోలేదు. అలాగే గ్రంథాలయం నడిపే అనంత నారాయణ పాత్ర వైపు నుంచి కూడా ఎమోషన్స్ అంతగా కనెక్ట్ కాలేదు. ప్రధానమైన పాత్రలను పోషించిన వారు బాగానే చేశారు. సింగిల్ డైలాగ్ ఆర్టిస్టులకు సంబంధించిన సీన్స్ కృతకంగా అనిపిస్తాయి. ఆ విషయంలో శ్రద్ధ పెడితే బాగుండేదేమో. అలాగే భరణి శంకర్ పాత్రను కూడా ఇంకాస్త ఇంట్రెస్టింగ్ గా చూపించవలసిందేమో అనిపిస్తుంది. సాయితేజ ఫొటోగ్రఫీ .. ప్రియదర్శన్ బాలసుబ్రమణియన్ నేపథ్య సంగీతం .. సాజత్ అలీ ఎడిటింగ్ ఓ మాదిరిగా అనిపిస్తుంది. ఈ 4 నాలుగు ఎపిసోడ్స్ వరకూ చూసుకుంటే, కథాకథనాలలో కొత్తదనం కనిపించలేదు. పాత్రలు కూడా విభిన్నంగా .. విలక్షణంగా మలచడానికి తగిన ప్రయత్నాలు జరగలేదని అనిపిస్తుంది. అయితే ఇంకా రావలసిన ఎపిసోడ్స్ ఉన్నాయి గనుక, ఆ ఎపిసోడ్స్ ను ఆవిష్కరించే తీరు ఇంట్రెస్టింగ్ గా ఉంటే ఈ సిరీస్ గ్రాఫ్ పెరిగే ఛాన్స్ ఉందని చెప్పచ్చు.

శర్వానంద్ 'భోగి' సినిమా
విడుదల వాయిదా



యంగ్ హీరో శర్వానంద్ కథానాయకుడిగా, దర్శకుడు సంపత్ నంది కాంబినేషన్‌లో రూపొందుతున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'భోగి' విడుదల వాయిదా పడింది. ఈ మేరకు చిత్ర నిర్మాణ సంస్థ శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బుధవారం సోషల్ మీడియా వేదికగా అధికారికంగా ప్రకటన విడుదల చేసింది. అనుకోని కారణాల వల్ల సినిమా విడుదలను వాయిదా వేయాల్సి వచ్చిందని, త్వరలోనే సరికొత్త విడుదల తేదీని ప్రకటిస్తామని వెల్లడించింది. ఈ మేరకు చిత్రబృందం ఒక ప్రకటన విడుదల చేస్తూ.. "'భోగి' మా అందరికీ ఎంతో ప్రత్యేకమైన ప్రాజెక్ట్. ఎంతో ప్రతిష్టాత్మకంగా, అంకితభావంతో, ప్యాషన్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. ప్రేక్షకులకు థియేటర్లలో ఒక గొప్ప అనుభూతిని అందించాలనే సంకల్పంతో మొదటి నుంచీ పనిచేస్తున్నాం. అయితే కొన్ని ఊహించని కారణాల వల్ల సినిమా విడుదలను వాయిదా వేస్తున్నాం. విడుదల విషయంలో సామాజిక మాధ్యమాల్లో వచ్చే ఎలాంటి పుకార్లను, ఊహాగానాలను ఎవరూ నమ్మవద్దు. త్వరలోనే కొత్త విడుదల తేదీని అధికారికంగా ప్రకటిస్తాం" అని స్పష్టం చేసింది. ఈ ప్రణాళిక మార్పు వల్ల కలిగిన అసౌకర్యానికి విచారం వ్యక్తం చేసిన నిర్మాతలు, చిత్రాన్ని మరింత ఉన్నతంగా ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు తమకు ప్రేక్షకుల మద్దతు, సహనం అవసరమని కోరారు. ప్రేక్షకులు ఎదురుచూసే సమయానికి తగిన పూర్తి న్యాయం చేస్తామని మేకర్స్ హామీ ఇచ్చారు. వాస్తవానికి ఈ సినిమాను రేపు (నవంబర్ 12న) ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల చేయాలని గతంలో నిర్ణయించారు. ఈ చిత్రంలో శర్వానంద్ 'గంగ' అనే పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తున్నారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన పాత్ర వివరాలు ఇప్పటికే సినీ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించాయి. ఈ సినిమాలో అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయతి హీరోయిన్లుగా నటిస్తున్నారు. 1960ల కాలం నాటి నేపథ్యంలో, తెలంగాణ మరియు మహారాష్ట్ర సరిహద్దుల్లోని ఒక ఊహాజనిత గ్రామంలో జరిగే కథాంశంతో ఈ పీరియడ్ యాక్షన్ డ్రామాను దర్శకుడు సంపత్ నంది తెరకెక్కిస్తున్నారు. సాంకేతిక విభాగంలో ప్రతిభావంతులైన సాంకేతిక నిపుణులు పనిచేస్తున్నారు. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తుండగా, కిశోర్ కుమార్ అరోకియా సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కిరణ్ కుమార్ మన్నె ప్రొడక్షన్ డిజైనర్‌గా వ్యవహరిస్తున్నారు. పాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా రూపుదిద్దుకుంటున్న 'భోగి' చిత్రాన్ని తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

'టాక్సిక్' రిజల్ట్ నన్ను కుంగదీసింది
కియారా అద్వానీ



బాలీవుడ్ ప్రముఖ నటి కియారా అద్వానీ ఇటీవల నటించిన 'టాక్సిక్' సినిమా విడుదల సమయంలో తాను ఎదుర్కొన్న అనుభవాలు, భావోద్వేగాల గురించి తాజాగా ఓపెన్ అయ్యారు. సినిమా మొదటి రోజు వచ్చిన భారీ ఓపెనింగ్ కలెక్షన్లను చూసి అంతా సంతోషించినప్పటికీ, ఆ తర్వాత సినిమా ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోవడం తన బృందానికి ఎంతో బాధ కలిగించిందని ఆమె తెలిపారు. ముఖ్యంగా ఆ తొలి వారాంతంలో ఈ పరాజయం తనను ఎంతగానో కుంగదీసిందని, ఆ క్షణాలు తనను తీవ్ర నిరాశకు గురిచేశాయని కియారా పేర్కొన్నారు. అయితే, తన సాధారణ కంఫర్ట్ జోన్‌ను పూర్తిగా పక్కన పెట్టి, కెరీర్‌లోనే ఎంతో సవాల్‌తో కూడిన ఒక విభిన్నమైన పాత్రను పోషించానని, ఆ పాత్రకు మాత్రం ప్రేక్షకుల నుంచి మంచి ప్రశంసలు దక్కడం తనకు కాస్త ఊరటనిచ్చిందని చెప్పారు. ఈ సందర్భంలో పెళ్లి తర్వాత సినిమాలలో రొమాంటిక్ సన్నివేశాలలో నటించడంపై వస్తున్న ట్రోల్స్, విమర్శల గురించి కూడా ఆమె స్పందించారు. తన భర్త, ప్రముఖ నటుడు సిద్ధార్థ్ మల్హోత్రా ఈ విషయంలో ఎంతో మెచ్యూరిడ్‌గా వ్యవహరించారని కియారా కొనియాడారు. పెళ్లి తర్వాత రొమాంటిక్ సీన్లలో నటించడంపై సిద్ధార్థ్ ఎలాంటి అభ్యంతరం తెలపకపోగా, ఆ విషయాన్ని అసలు పట్టించుకోలేదని, ఎప్పుడూ తనతో ఆ గురించి ప్రస్తావించనేలేదని ఆమె వెల్లడించారు. తమ వివాహం తర్వాత ఈ అంశంపై ఇద్దరూ ఎప్పుడూ మాట్లాడుకోలేదని, ఆయనకు దీనిపై ఎలాంటి నెగెటివ్ అభిప్రాయం లేదని స్పష్టం చేశారు.

ఆస్కార్ బరిలో 'రామాయణ'



ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చిన భారతీయ పురాణేతిహాస గాథ 'రామాయణ'కు దేశవ్యాప్తంగా ప్రేక్షకులు అద్భుతమైన ఆదరణ కనబరుస్తున్నారు. సీతారాముల పాత్రల్లో సాయిపల్లవి, రణబీర్‌కపూర్ నటించిన ఈ చిత్రానికి నితేష్ తివారి దర్శకత్వం వహించారు. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రాన్ని ఆస్కార్ అవార్డుల పరిశీలనకు పంపించినట్లు వార్తలొస్తున్నాయి. 99వ ఆస్కార్ పురస్కారాల కోసం భారతదేశం తరపున ఉత్తమ అంతర్జాతీయ చిత్రం కేటగిరీలో మరాఠీ చిత్రం 'గోంధల్' అధికారికంగా ఎంపికైన విషయం తెలిసిందే. అయితే ఇతర భారతీయ చిత్రాలు కూడా ఆస్కార్ మిగతా విభాగాల్లో పోటీపడేందుకు అవకాశం ఉంటుంది.అకాడమీ నిర్దేశించిన ప్రమాణాలను అందుకుంటే విదేశీ చిత్రాలను స్వతంత్ర పరిశీలనకు పంపించవొచ్చు. ఈ నేపథ్యంలో 'రామాయణ' చిత్రాన్ని విజువల్ ఎఫెక్ట్స్ విభాగంలో ఆస్కార్ పరిశీలనకు పంపినట్లు సమాచారం. 'గోంధల్'తో పాటు నాగాలాండ్ నేపథ్య కథాంశంతో రూపొందిన 'అంఘ్' చిత్రం సైతం ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో అకాడమీ పరిశీలనకు ఎంపికయ్యే అర్హతను సాధించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో భారత్ నుంచి 'రామాయణ' చిత్రం కూడా ఆస్కార్ బరిలో అర్హత సాధించేందుకు పోటీలో నిలవడం విశేషం.

మోహనకృష్ణ ఇంద్రగంటి సూపర్ హీరో చిత్రం

క్రియేటివ్ డైరెక్టర్ మోహనకృష్ణ ఇంద్రగంటి ఓ సూపర్ హీరో చిత్రాన్ని రూపొందించబోతున్నారు. రోషన్ మేక కథానాయకుడిగా నటిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని అశోక క్రియేషన్స్ పతాకంపై అశోక్‌వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మిస్తున్నారు. బుధవారం హైదరాబాద్‌లో ఈ సినిమా ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి హీరో శ్రీకాంత్ క్లాప్‌నివ్వగా, ముప్పా వెంకయ్య చౌదరి కెమెరా స్విచాన్ చేశారు. ప్రపంచస్థాయి ప్రమాణాలతో అత్యాధునిక సాంకేతిక హంగులతో ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నామని, వీఎఫ్ఎక్స్ వర్క్‌కు అధిక ప్రాధాన్యత ఉంటుందని, డిసెంబర్ మొదటి వారంలో చిత్రీకరణ ప్రారంభిస్తామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రం ద్వారా బాలీవుడ్ నటి రేఖా పాండే తెలుగు ఇండస్ట్రీలోకి అడుగుపెడుతున్నారు. ఈ చిత్రానికి కెమెరా: పీజీ విందా, సంగీతం: గౌరహరి, ప్రొడక్షన్ డిజైన్: రామకృష్ణ సబ్బాని, మోనికా నిగోత్రే, రచన-దర్శకత్వం: మోహనకృష్ణ ఇంద్రగంటి.

'ఇడుపు కాయితం' టీజర్ వచ్చేసింది.. డిసెంబర్ 11న గ్రాండ్‌గా రిలీజ్!



టాలీవుడ్ వర్గాల్లో ప్రస్తుతం ఆసక్తికరంగా చర్చనీయాంశంగా మారిన చిత్రం 'ఇడుపు కాయితం'. వైవిధ్యమైన కథలతో ప్రేక్షకులను అలరించే టాలెంటెడ్ హీరో ప్రియదర్శి పులికొండ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ సినిమా నుంచి తాజాగా విడుదలైన టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటూ సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చింది. తెలంగాణ మట్టి వాసన ఉట్టిపడేలా, పల్లెటూరి సంప్రదాయాలు మరియు కుటుంబ భావోద్వేగాల నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. ఇందులో ప్రియదర్శి సరసన నాగదుర్గ కథానాయికగా నటిస్తూ ఈ చిత్రంతో వెండితెరకు పరిచయమవుతున్నారు. వంశీరెడ్డి దొండపాటి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థలు సుకుమార్ రైటింగ్స్ మరియు బన్నీ వాస్ వర్క్స్ సంయుక్తంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సుకుమార్, బన్నీ వాస్, తబితా సుకుమార్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఇక ఈ చిత్రానికి సురేష్ బొబ్బిలి అందిస్తున్న సంగీతం అదనపు ఆకర్షణగా నిలుస్తోంది. ఇప్పటికే విడుదలైన 'శ్రీలత', 'గడప', 'బరాత్ బీట్' పాటలు శ్రోతలను విపరీతంగా అలరించగా, తాజాగా విడుదలైన టీజర్ సినిమాపై మరింత హైప్‌ను క్రియేట్ చేసింది. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ చిత్రం డిసెంబరు 11న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రస్తుతం యూట్యూబ్‌లో ట్రెండ్ అవుతున్న ఈ చిత్ర టీజర్ సినిమాపై అంచనాలను మరింత పెంచేసింది.

కవితాత్మక ప్రేమకథకు శ్రీకారం



హీరో సిద్ధు జొన్నలగడ్డ నటిస్తున్న పదవ చిత్రం బుధవారం ప్రారంభమైంది. పొయెటిక్ లవ్‌స్టోరీగా తెరకెక్కనున్న ఈ చిత్రం ద్వారా మోహన్.బి దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. సుకుమార్ రైటింగ్స్, బన్నీవాస్ వర్క్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. నయన్ సారిక కథానాయికగా నటిస్తున్నది. ముహూర్తపు సన్నివేశానికి అగ్ర దర్శకుడు సుకుమార్ కెమెరా స్విచాన్ చేయగా, అల్లు అరవింద్ క్లాప్‌కొట్టారు. ఈ సందర్భంగా విడుదల చేసిన థీమ్ పోస్టర్ సినిమా కథా ప్రపంచాన్ని ఆవిష్కరిస్తూ పొయెటిక్ ఫీల్‌తో ఆకట్టుకుంది. సుకుమార్ బృందంలో కీలక సభ్యుడిగా ఉన్న దర్శకుడు మోహన్.బి ఈ సినిమా కోసం ఓ అందమైన, కవితాత్మక భావనలతో సాగే ప్రేమకథను సిద్ధం చేశారని, సిద్ధు జొన్నలగడ్డ పాత్ర చిత్రణ నవ్యరీతిలో ఉంటుందని మేకర్స్ తెలిపారు. షూటింగ్ త్వరలో ప్రారంభంకానున్న ఈ చిత్రానికి కెమెరా: చంద్రు సెల్వరాజ్, సంగీతం: జీవీ ప్రకాష్ కుమార్, నిర్మాతలు: అన్మోల్ శర్మ, బన్నీ వాసు, అశోక్ బండ్రెడ్డి, దర్శకత్వం: మోహన్.బి.

తిరుపతి రెడ్డిని వెంటనే అరెస్ట్ చేయాలి
దళిత సంఘాల డిమాండ్

- తిరుపతి రెడ్డిని రెడ్లే కాపాడుతున్నరనే ఆరోపణలు .
- రెడ్లకో న్యాయం... దళితులకో న్యాయమా...
- సుల్తానాబాద్ లో చిలక ఉదయ్ పైనే దాడి...
- గోదావరిఖనిలో అచ్యుతరాణి హత్య...
- పుట్టపాకలో ఒక దళిత సర్పంచ్ పై దాడి
- అధికారులకు ఇప్పటికైనా కనువిప్పు కలగాలి..
- రెడ్ల పై దళిత సంఘం నాయకులు కన్నెర్ర..



మంథని(ప్రశ్న న్యూస్) పుట్టపాక సర్పంచ్ కన్నూరి రాజబాబును అసభ్య పదజాలంతో దూషించిన తిరుపతి రెడ్డిని పోలీసులు వెంటనే అరెస్ట్ చేయాలని, లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని దళిత సంఘాల నాయకులు హెచ్చరించారు. గురువారం మంథని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు మంథని లక్ష్మణ్, బహుజన సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు తగరం శంకర్ లాల్, దళిత సేన రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ అధ్యక్షులు గద్దల శంకర్, మంథని మండల మాజీ వైస్ ఎంపీపీ వేల్పుల గట్టయ్య, దళిత సేన డివిజన్ అధ్యక్షుడు ఊట్ల శ్రీనివాస్ మాట్లాడారు. నగరంపల్లి గ్రామ కాంగ్రెస్ నాయకుడు పోరెడ్డి తిరుపతి రెడ్డి, సర్పంచ్ రాజబాబును అవమానకరంగా మాట్లాడారని వారు ఆరోపించారు. ఇది హేయమైన చర్య అని తీవ్రంగా ఖండించారు. మాదిగ సామాజిక వర్గానికి చెందిన సర్పంచ్ రాజబాబును అవమానించిన తిరుపతి రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్ చేయడమే కాకుండా, అరెస్ట్ చేసి చట్ట ప్రకారం ఎస్సి ఎస్టీ యాక్ట్ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. తిరుపతి రెడ్డి అరెస్ట్ కాకపోవడం వెనుక ఏదైనా కుట్ర ఉందేమోనని అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులు ఇప్పటికైనా జాప్యం చేయకుండా తిరుపతి రెడ్డిని అరెస్ట్ చేసి ప్రజలకు నమ్మకం కలిగించాలని కోరారు. 24 గంటలలో అరెస్ట్ చేయకుంటే మంథని నియోజకవర్గ బంద్ ప్రకటిస్తామని, పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో మంథని, రామగిరి, ముత్తారం, కమాన్‌పూర్ మండలాలకు చెందిన దళిత సంఘాల పెద్దపెల్లి జిల్లా అధ్యక్షుడు మంథని లక్ష్మణ్ మంథని మండల మాజీ వైస్ ఎంపీపీ వేల్పుల గట్టయ్య పెద్దపెల్లి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కన్నూరు ఓదెలు నాయకులు ఆసం తిరుపతి, , కడారి సంపత్, దేవన్న, విజయ్ కుమార్, పుల్లూరి బాబు, జనగామ సంతోష్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

దళితుల ఆధీనంలోని
అసైన్డ్ భూమిని కాపాడాలి

కబ్జాదారుల పై చట్టపరమైన కఠిన చర్యలు

తీసుకోవాలని తహసీల్దార్ కు ఫిర్యాదు



కోహెడ(ప్రశ్న న్యూస్) మండలంలోని శనిగరం గ్రామ పరిధిలోని అసైన్డ్ భూమిని పోరెడ్డి రాజు తండ్రి భాగయ్య తో పాటు కొందరు వ్యక్తులు నకిలీ పత్రాలు సృష్టించి ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారు, ఆ భూమిని కాపాడి దళిత వర్గాలకు న్యాయం చేయాలని కోరుతూ గ్రామస్థులు తహసీల్దార్‌కు ఫిర్యాదు అందజేశారు.సుమారు మూడు తరాల నుంచి ఈ భూమి ఎస్సీ వర్గాల ఆధీనంలో ఉంటూ వస్తోందని గ్రామస్థులు తెలిపారు. ఆయా కుల సంఘాలకు సంబంధించిన కార్యక్రమాలతో పాటు, కులస్తుల్లో ఎవరైనా మరణించినప్పుడు కర్మకాండలు, ఇతర సంప్రదాయ కార్యక్రమాలను ఈ స్థలంలోనే నిర్వహించుకుంటున్నట్లు పేర్కొన్నారు.ఈ భూమిలో దళిత కుల సంఘానికి ఫంక్షన్ హాల్ మంజూరు చేయాలని గతంలో సంబంధిత మంత్రి సైతం రాతపూర్వకంగా వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. కొందరు వ్యక్తులు ఆక్రమించడానికి ప్రయత్నం చేస్తున్నారు వారికి కుల సంఘ పెద్దలు గ్రామస్తులు పలుమార్లు చెప్పిన పట్టించుకోకుండా ఈ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దళిత వర్గాలు ఏమీ చేయలేవనే ధోరణితో తమ అభ్యంతరాలను బేఖాతరు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం, రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి భూమి రికార్డులను పరిశీలించి, సమగ్ర విచారణ చేపట్టి అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని గ్రామస్థులు కోరారు. దళిత వర్గాలకు న్యాయం జరిగేలా భూమిని పరిరక్షించి, కుల సంఘానికి ఫంక్షన్ హాల్ మంజూరు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ నాయకులు లింగంపల్లి సత్తయ్య అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు తడకపల్లి మహేష్ మరాటి రాజు లింగంపల్లి అశోక్ రవి రాజకుమార్ రాజు వడ్లూరి సురేందర్ పలువురు నాయకులు, దళిత సంఘం ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్
జయంతి వేడుకల్లో చున్నుపాష



కూకట్ పల్లి (ప్రశ్న న్యూస్) మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ అధ్యక్షుడు చున్నుపాష గాంధీ భవన్ లో నిర్వహించిన జయంతి వేడుకల్లో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి రాష్ట్ర మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఇర్ఫాన్ తో కలిసి బహుమతులు ప్రధానం చేశారు.

1,100 మంది విద్యార్థులతో 'ఖేలో జీతో 2026' సంబరాలు

27 పాఠశాలల భాగస్వామ్యం.. విజేతలకు నగదు బహుమతులు, పతకాలు.. విద్యార్థుల భద్రతకు ప్రత్యేక ఏర్పాట్లు

కాప్రా (ప్రశ్న న్యూస్) బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి, ఆత్మవిశ్వాసం, ప్రతిభను ప్రోత్సహించేందుకు రుద్ర ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భారీ స్థాయిలో అంతర్ పాఠశాలల క్రీడా, సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నారు. 'ఖేలో – జీతో' పేరుతో ఈ నెల 12, 13, 14 తేదీల్లో మూడు రోజులపాటు ఈ వేడుకలు జరగనున్నాయి. మేడ్చల్ జిల్లాలోని 27 పాఠశాలలకు చెందిన సుమారు 1,100 మంది విద్యార్థులు ఇందులో పాల్గొననున్నారు.

వివిధ విభాగాల్లో పోటీలు..

బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, క్విజ్, నృత్యం, గానం తదితర పోటీలు నిర్వహించనుండగా, బాలురకు ప్రత్యేకంగా క్రికెట్ పోటీలు ఏర్పాటు చేశారు. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా, సాంస్కృతిక ప్రతిభను వెలికితీసేలా పోటీలను రూపొందించారు. ఆయా విభాగాల్లో మొదటి స్థానంలో నిలిచిన వారికి రూ.2,500, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ.1,500, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ.1,000 నగదు బహుమతులు అందజేయనున్నారు. విజేతలకు పతకాలు, పాఠశాలలకు షీల్డులు ప్రదానం చేయడంతో పాటు ప్రథమ స్థానంలో నిలిచిన వారికి ప్రత్యేక కప్ అందజేయనున్నారు.

విద్యార్థుల సౌకర్యాలకు పెద్దపీట..

ఈ సందర్భంగా రుద్ర ఫౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ రేపాక సత్యనారాయణ మాట్లాడుతూ.. పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మంచినీరు, మరుగుదొడ్లు, ప్రథమ చికిత్స (ఫస్ట్ ఎయిడ్) కిట్లు వంటి సదుపాయాలు కల్పించినట్లు పేర్కొన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ) నుంచి అధిక సంఖ్యలో వాలంటీర్లను నియమించడంతో పాటు, క్రీడా కోచ్‌ల పర్యవేక్షణలో పోటీలను నిర్వహించనున్నట్లు వివరించారు. విద్యార్థుల సౌకర్యాలు, భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు.

14న బహుమతి ప్రదానోత్సవం..

ఈ నెల 12, 13 తేదీల్లో క్రీడా పోటీలు నిర్వహించనుండగా, 14వ తేదీన సాయంత్రం 4 గంటలకు బహుమతి ప్రదానోత్సవం, ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మౌలాలి హెచ్‌బీ కాలనీలోని మొదటి ఫేజ్ ప్లే గ్రౌండ్‌లో ఈ కార్యక్రమాలు జరగనున్నాయి. విద్యార్థులకు క్రీడలు, చదువుతో పాటు ఇతర రంగాల్లోనూ ప్రోత్సాహం అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు.



శోభారాజన్‌కు వడ్డేపల్లి రాజేశ్వరరావు అభినందనలు



కూకట్ పల్లి(ప్రశ్న న్యూస్) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలిగా నియమితులైన శోభారాజన్ ను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు అభినందించారు. గురువారం ఆయన కార్యాలయానికి మర్యాదపూర్వకంగా కలవడానికి వచ్చిన సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు శోభారాజన్ ను శాలువాతో సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళా మోర్చా ద్వారా పార్టీ బలోపేతానికి, మహిళల సమస్యల పరిష్కారానికి మరింత చురుకుగా కృషి చేస్తూ, అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా మోర్చా నాయకురాలు విజయ భవాని, మోతీ నగర్ డివిజన్ బిజెపి అధ్యక్షుడు ఎర్ర స్వామి, డివిజన్ నాయకులు రమేష్ నాయర్,ఎలేందర్ రెడ్డి,వాసవి, నమ్రత తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని ప్రైవేట్ ఆసుపత్రులపై చర్యలు తీసుకుంటాం

జిల్లా అదనపు కలెక్టర్ ప్రసన్నాంబ



జగిత్యాల (ప్రశ్న న్యూస్) జగిత్యాల జిల్లాలో ప్రైవేట్ ఆసుపత్రులు క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం--2010 ప్రకారం తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. నిబంధనలు పాటించని ఆసుపత్రులపై చర్యలు తీసుకుంటాం అని అదనపు కలెక్టర్ ఎన్. ప్రసన్నాంబ తెలిపారు.గురువారం జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. ప్రసన్నాంబ అధ్యక్షతన జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ సమావేశం అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో నిర్వహించారు. తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్స్ (రిజిస్ట్రేషన్ అండ్ రెగ్యులేషన్) నిబంధనలు--2022 ప్రకారం, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం-2010 అమలుపై ఈ సమావేశంలో సమీక్షించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఎన్. ప్రసన్నాంబ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రైవేట్ ఆసుపత్రులు క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం-2010 ప్రకారం తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ సమయంలో నమోదు చేసిన వైద్యులు, పారామెడికల్ సిబ్బంది మాత్రమే ఆయా ఆసుపత్రుల్లో వైద్య సేవలు అందించాలని స్పష్టం చేశారు. సిబ్బంది ఎవరైనా విధుల నుంచి వెళ్లిపోయినా, కొత్తగా వైద్యులు లేదా సిబ్బంది చేరినా సంబంధిత వివరాలను తప్పనిసరిగా రిజిస్ట్రేషన్‌లో అప్‌డేట్ చేయించుకోవాలని ఆదేశించారు.ప్రైవేట్ ఆసుపత్రుల్లో సాధారణ వైద్యం, శస్త్రచికిత్సలు, ప్రసవాలు తదితర వైద్య సేవలకు వసూలు చేసే ఫీజుల వివరాలను ప్రజలకు కనిపించే విధంగా స్పష్టమైన బోర్డులపై ప్రదర్శించాలని సూచించారు. వైద్యం కోసం వచ్చే నిరుపేదలకు ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు మానవతా దృక్పథంతో తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందించాలని కోరారు. ఆసుపత్రుల్లో బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ పకడ్బందీగా చేపట్టడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జి. సుజాత మాట్లాడుతూ జిల్లాలో క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం అమలవుతున్న తీరును, నిబంధనలు పాటించని ఆసుపత్రులపై ఇప్పటివరకు తీసుకున్న చర్యలను సమావేశానికి వివరించారు. ఈ సమావేశంలో ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ జి. శశికాంత్ రెడ్డి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ఎం. శ్రీనివాస్, ఇన్‌చార్జి డెమో ఏనుగంటి రాజేశం, హెల్త్ ఎడ్యుకేటర్ రవీందర్ రాథోడ్, జూనియర్ అసిస్టెంట్ వి. సాగర్ తదితరులు పాల్గొన్నారు.

నల్లగండ్ల ఫ్లైఓవర్ వద్ద
రోడ్డు ప్రమాదం, వ్యక్తి మృతి



శేర్లింగంపల్లి (ప్రశ్న న్యూస్)నల్లగండ్ల ఫ్లైఓవర్ సిగ్నల్ వద్ద గురువారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజ్‌కుమార్ (40) మృతి చెందాడు. వివరాల ప్రకారం.. హోండా యాక్టివా (టూ 15 ఈఏ 0112)పై గచ్చిబౌలి నుంచి పటాన్‌చెరు వైపు వెళ్తుండగా, టూ 08 ఖూ 8274 నంబర్ గల వాటర్ ట్యాంకర్ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన రాజ్‌కుమార్‌ను ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై చందానగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో ప్రో టీ20 క్రికెట్ లీగ్



శేర్లింగంపల్లి (ప్రశ్న న్యూస్) యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నవంబర్ 12, 14, 15 తేదీల్లో ప్రో టీ20 క్రికెట్ లీగ్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, షాదాన్, అరోరా, మహీంద్రా, హెచ్‌సీయూ హాక్స్, ఎల్లెంకి జట్లు పాల్గొంటున్నాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అడిషనల్ ఎస్పీ వెంకటేశ్వర్లు, సుదర్శన్ నగర్ ప్రెసిడెంట్ రాజశేఖర్ హాజరయ్యారు. యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ సిద్ధార్థ్ డి. ఆధ్వర్యంలో రాజశేఖర్ సింగదాసరి, ఈశ్వర్, శ్రీనివాస్ తదితరులు ఏర్పాట్లు చేశారు.

చందానగర్‌లో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు..
ఇరుకు రోడ్డులో ఆసుపత్రి నిర్వహణ



శేర్లింగంపల్లి(ప్రశ్న న్యూస్)మియాపూర్ సర్కిల్ పరిధిలోని చందానగర్‌లో అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

ప్లాట్ నంబర్లు 1-24, 1-25 గల భవనాల్లో అక్రమ నిర్మాణ పనులు కొనసాగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఇదే ప్రాంతంలోని మరో భవనంలో కింద అంతస్తులో ఆసుపత్రిని ప్రారంభించి, పై అంతస్తుల్లో నిర్మాణ పనులు కొనసాగిస్తున్నారు.ఇరుకైన రోడ్డులో ఎలాంటి రహదారి విస్తరణ సౌకర్యాలు లేకుండా ఆసుపత్రి నిర్వహిస్తుండటంతో అంబులెన్స్ రాకపోకలకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో అక్రమ నిర్మాణాన్ని గుర్తించి మియాపూర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేతలు చేపట్టినా, సదరు బిల్డర్ మళ్లీ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.గతంలో కూల్చివేతలు చేసినా తిరిగి నిర్మాణాలు ఎలా కొనసాగుతున్నాయనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా టౌన్ ప్లానింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

జరుగరాని ప్రమాదం జరిగితే బాధ్యులు ఎవరు.?

- రోడ్లపై ప్రమాదకరంగా తిరుగుతున్న టిప్పర్లు- ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా పెద్ద పెద్ద బండల తరలింపు

- నిబంధనలు పాటించని టిప్పర్లతో ప్రమాదం పట్టించుకోని అధికారులు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఒకపక్క బండ్ల టిప్పర్లు.. మరో పక్క అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్లు.. అతివేగంగా వెళుతూ ప్రయాణికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా పెద్దపెద్ద బండలను ను తరలిస్తున్న టిప్పర్ల వల్ల జరగరాని ప్రమాదం జరుగుతే ఎవరు బాధ్యులు అంటూ ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు టిప్పర్ల యజమానులు జాగ్రత్తలు తీసుకోరు. సరే ఇలాంటి టిప్పర్లపై అధికారులు ఏమైనా చర్యలు తీసుకుంటారా అంటే అది లేదు. దీంతో గుండ్ల పోచంపల్లి నుండి అయోధ్యకు వెళ్లే రోడ్డుపైన రై రైమంటూ బండల టిప్పర్లు. అక్రమ మట్టి తరలింపు టిప్పర్లు దూసుకెళుతుండడంతో ద్విచక్ర వాహన దారులు గుండెలపై చేయి వేసుకొని ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఏ టిప్పర్ వచ్చి ఢీకొంటుందో నన్న భయంతో బిక్కు బిక్కు మంటూ ద్విచక్ర వాహనదారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్నారు. అతివేగంగా నిర్లక్ష్యంగా వెళుతున్న టిప్పర్లను అదుపు చేయాల్సిన సంబంధిత అధికారులు మొద్దు నిద్రలో ఉండటం వల్ల టిప్పర్ల హవా కొనసాగుతుంది.

ప్రమాదకరంగా తిరుగుతున్న బండ్ల టిప్పర్లు

పెద్దపెద్ద బండ్లను టిప్పర్ లో తీసుకెళ్తూ ప్రమాదకరంగా తిరుగుతున్నాయి. పెద్దపెద్ద బండ్లను తరలించే ముందు కనీస జాగ్రత్తలు కూడా టిప్పర్ల యజమానులు తీసుకోవడం లేదని జోరుగా విమర్శలు వినిపిస్తున్నాయి. టిప్పర్ లో తరలించే పెద్ద పెద్ద బండలు కింద పడకుండా ఉండేందుకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా టిప్పర్ లో అతివేగంగా తరలిస్తూ తోటి ప్రయాణికులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. బండరాలను తరలిస్తే డబ్బులు వచ్చాయా లేవా అనే విషయాన్ని చూస్తున్నారే తప్ప ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా రోడ్లపైన అతివేగంగా నడుపుతూ ద్విచక్ర వాహనదారులకు బండ్ల టిప్పర్లు చుక్కలు చూపిస్తున్నాయి.

కనీస జాగ్రత్తలు కూడా పాటించరా.?

పెద్ద పెద్ద బండలను తీసుకెళ్లే టిప్పర్లు కనీస జాగ్రత్తలు కూడా పాటించడం లేదని తోటి ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఎలాంటి డోర్లు లేని టిప్పర్లలో బండలను తరలించడమే కాకుండా అతివేగంగా వెళ్లడం వల్ల పొరపాటున టిప్పర్ల నుండి బండలు కింద పడి ప్రమాదం జరిగితే బాధ్యులు ఎవరని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. పెద్ద పెద్ద బండ రాళ్లు తీసుకెళ్లే ముందు కింద పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవడం లేదని. పొరపాటున ద్విచక్ర వాహనదారులు టిప్పర్ల వెనుక వెళ్తే వారి పైన ఈ బండరాలు పడే ప్రమాదం ఉందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇదే మాదిరిగా గుండ్ల పోచంపల్లి లోని క్వాస గ్రాండ్ నుండి అయోధ్య వైపు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వెళుతున్న బండ్ల టిప్పర్ మనం దినపత్రిక ప్రతినిధి కండ్ల లో పడింది. వెంటనే అదృశ్యాన్ని తన కెమెరాలో చిత్రీకరించారు. ఎలాంటి జాగ్రత్తలు లేకుండా ప్రమాదకరంగా వెళుతున్న ఈ టిప్పర్ ని చూసి ద్విచక్ర వాహనదారులు ఆందోళనకు గురయ్యారు.

నిర్లక్ష్యంగా నడిచే టిప్పర్ల ను సీజ్ చేయాలి

ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా అతివేగంగా నడిపే పెద్ద పెద్ద బండలను తీసుకెళ్లే టిప్పర్లను, మట్టిని తరలించే తిప్పర్లను సీజ్ చేయాలని అప్పుడే టిప్పర్ల యజమానులకు భయం ఉంటుందని తోటి ప్రయాణికులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు ఇలాంటి టిప్పర్లపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను కోరుతున్నారు.

సందిరి బాలయ్య గంగపుత్ర 115వ జయంతి వేడుకలు

-'ఆధ్యాత్మిక భక్తి యోగ తత్వం' పుస్తకావిష్కరణ

-రవీంద్ర భారతిలో ఘనంగా కార్యక్రమం..

పుస్తకాన్ని ఆవిష్కరించిన ప్రముఖులు

-ముఖ్య అతిథులుగా రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య, మాస్ వ్యవస్థాపక అధ్యక్షులు కటకం నర్సింగ్ రావు







హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)గంగపుత్ర జాతిపితగా పేరొందిన కీర్తిశేషులు సందిరి బాలయ్య గంగపుత్ర 115వ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గంగపుత్రుల సామాజిక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక వారసత్వాన్ని ప్రతిబింబించేలా రచించిన 'ఆధ్యాత్మిక భక్తి యోగ తత్వం' పుస్తకాన్ని ప్రముఖుల చేతుల మీదుగా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య, మాస్ వ్యవస్థాపక అధ్యక్షులు కటకం నర్సింగ్ రావు, టీఆర్ఎస్ పార్టీ నాయకులు ముఠా జయసింహ, గంగ తెప్పోత్సవ కమిటీ అధ్యక్షులు మార్ము మహేందర్ బాబు, ప్రధాన కార్యదర్శి పూస నరసింహ, బెస్త సామాజికవేత్త, భజన గానగంధర్వ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.తెలంగాణ రాష్ట్ర గంగపుత్ర చైతన్య సమితి అధ్యక్షులు మంగళపల్లి శంకర్ ఆధ్వర్యంలో, రాష్ట్ర కమిటీ సభ్యులు మదునాల బాలరాజు తదితరుల భాగస్వామ్యంతో ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. రచయిత మదునాల బాలరాజు రచించిన ఈ గ్రంథం నేటి తరంతో పాటు భావితరాలకు గంగపుత్రుల సామాజిక జీవన విధానం, కుల సంప్రదాయాలు, కుటుంబ ఆచారాలు, సంస్కృతి, ఆధ్యాత్మిక విలువలను పరిచయం చేసే విధంగా రూపొందించడం విశేషం.ఈ పుస్తక రచనకు ప్రేరణనిచ్చిన పూస నరసింహకు నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆయన అందించిన ప్రోత్సాహం, సూచనలు పుస్తక రూపకల్పనకు దోహదపడ్డాయని పేర్కొన్నారు.మాస్ వ్యవస్థాపక అధ్యక్షులు కటకం నర్సింగ్ రావు, తెలంగాణ రాష్ట్ర గంగపుత్ర చైతన్య సమితి అధ్యక్షులు మంగళపల్లి శంకర్, ప్రధాన కార్యదర్శి కైరంకొండ నర్సింగ్ రావు తదితరులు పుస్తకాన్ని ఆవిష్కరించి రచయితను అభినందించారు. ముఖ్యంగా రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య కార్యక్రమం ముగిసే వరకు సభలోనే ఉండి పుస్తకావిష్కరణ వేడుకను విజయవంతం చేయడం పట్ల గంగపుత్ర సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. గంగపుత్రుల అభ్యున్నతి, ఐక్యత, సామాజిక చైతన్యానికి ఇలాంటి కార్యక్రమాలు మరింత దోహదపడతాయని వక్తలు అభిప్రాయపడ్డారు.ఈ వేడుకను విజయవంతం చేసిన అతిథులు, సంఘ నాయకులు, రచయితలు, అభిమానులందరికీ నిర్వాహకులు హృదయపూర్వక ధన్యవాదాలు మదునాల బాలరాజు తెలియజేశారు.

హైదరాబాద్ రియల్ ఎస్టేట్‌కు ప్రీమియం కళ

పది నెలల్లో రూ.44,305 కోట్ల ప్రాపర్టీ రిజిస్ట్రేషన్లు

- రూ.కోటి పైబడిన ఇళ్లదే హవా, మొత్తం విక్రయ విలువలో 51 శాతం వాటా

- జనవరి-అక్టోబర్ మధ్య 61,033 ఇళ్ల రిజిస్ట్రేషన్లు

- లావాదేవీల విలువలో 3 శాతం వృద్ధి.. సంఖ్యలో 1 శాతం తగ్గుదల

- చదరపు అడుగు సగటు ధర రూ.5,184.. ఏడాదిలో 10 శాతం పెరుగుదల

- అక్టోబర్ రిజిస్ట్రేషన్లలో 52 శాతం వాటాతో రంగారెడ్డి జిల్లా టాప్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) నగర రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో ప్రీమియం ప్రాపర్టీల జోరు కొనసాగుతోంది. ఒకవైపు ఇళ్ల రిజిస్ట్రేషన్ల సంఖ్య స్వల్పంగా తగ్గుతున్నప్పటికీ, మరోవైపు లావాదేవీల విలువ మాత్రం పెరుగుతోంది. ముఖ్యంగా రూ.కోటికి పైబడిన విలాసవంతమైన ఇళ్ల కొనుగోళ్లు మార్కెట్‌కు కొత్త ఊపునిస్తున్నాయి. 2026 జనవరి నుంచి అక్టోబర్ వరకు పది నెలల కాలంలో హైదరాబాద్ పరిధిలో 61,033 నివాస గృహాలు రిజిస్టర్ కాగా, వీటి మొత్తం లావాదేవీల విలువ రూ.44,305 కోట్లకు చేరింది. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే రిజిస్ట్రేషన్ల సంఖ్య 1 శాతం తగ్గినా, మొత్తం విలువలో 3 శాతం వృద్ధి నమోదైంది. ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ నైట్ ఫ్రాంక్ ఇండియా విడుదల చేసిన తాజా నివేదిక ఈ విషయాలను వెల్లడించింది.

- పెరిగిన ప్రీమియం ఇళ్ల వాటా

హైదరాబాద్ హౌసింగ్ మార్కెట్‌లో కొనుగోలుదారుల అభిరుచులు మారుతున్నాయని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యంగా అధిక ధర కలిగిన ఇళ్లకు డిమాండ్ పెరుగుతోంది. మొత్తం రిజిస్ట్రేషన్లలో రూ.50 లక్షల లోపు ధర కలిగిన ఇళ్లు 55 శాతం వాటాను దక్కించుకోగా, రూ.50 లక్షల నుంచి రూ.కోటి మధ్య ధర ఉన్న ఇళ్లు 25 శాతం వాటాను నమోదు చేశాయి. రూ.కోటికి పైబడిన ఇళ్లు రిజిస్ట్రేషన్ల సంఖ్యలో 20 శాతం మాత్రమే ఉన్నప్పటికీ, మొత్తం లావాదేవీల విలువలో ఏకంగా 51 శాతం వాటాను సొంతం చేసుకున్నాయి. ఈ ప్రీమియం విభాగంలో రిజిస్ట్రేషన్లు గతేడాది 12,246 ఉండగా, ఈ ఏడాది 12,322కు పెరిగాయి. వీటి మొత్తం విలువ 6 శాతం వృద్ధితో రూ.22,680 కోట్లకు చేరింది. గతేడాది ఇదే కాలంలో ఈ విలువ రూ.21,475 కోట్లుగా ఉంది. అక్టోబర్ నెలలో అయితే రూ.కోటి పైబడిన ఇళ్ల వాటా మొత్తం లావాదేవీల విలువలో 59 శాతానికి చేరడం విశేషం.

- అక్టోబర్‌లో స్వల్ప మందగమనం

2026 అక్టోబర్‌లో హైదరాబాద్‌లో 5,318 నివాస ప్రాపర్టీలు రిజిస్టర్ అయ్యాయి. వీటి మొత్తం విలువ రూ.4,395 కోట్లుగా నమోదైంది. గతేడాది అక్టోబర్‌తో పోలిస్తే రిజిస్ట్రేషన్ల సంఖ్య 14 శాతం తగ్గగా, సెప్టెంబర్‌తో పోలిస్తే 5 శాతం క్షీణించింది. లావాదేవీల విలువ వార్షికంగా 3 శాతం, నెలవారీగా 2 శాతం తగ్గింది. సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 10 వరకు కొనసాగిన పితృపక్షాల కారణంగా కొనుగోలుదారులు కొత్త ప్రాపర్టీల కొనుగోళ్లను వాయిదా వేసుకోవడం ఈ మందగమనానికి ప్రధాన కారణంగా నివేదిక పేర్కొంది. నైట్ ఫ్రాంక్ ఇండియా చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శిశిర్ బైజల్ మాట్లాడుతూ హైదరాబాద్ నివాస గృహాల మార్కెట్ లావాదేవీల పరిమాణంలో స్థిరంగా కొనసాగుతోందని, అయితే అధిక విలువ కలిగిన ప్రీమియం గృహాల కొనుగోళ్లతో మొత్తం విక్రయ విలువ పెరుగుతోందని వివరించారు. అక్టోబర్‌లో పితృపక్షాల ప్రభావంతో రిజిస్ట్రేషన్లు తగ్గినప్పటికీ, మార్కెట్ విలువ పరంగా సానుకూల ధోరణి కొనసాగుతోందని పేర్కొన్నారు.

- పెద్ద ఇళ్లవైపు కొనుగోలుదారుల చూపు

ఇళ్ల కొనుగోళ్లలో విస్తీర్ణానికి కూడా ప్రాధాన్యం పెరుగుతోంది. 2026 అక్టోబర్‌లో నమోదైన రిజిస్ట్రేషన్లలో 1,000 నుంచి 2,000 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన ఇళ్ల వాటా 65 శాతంగా ఉంది. 2,000 నుంచి 3,000 చదరపు అడుగుల ఇళ్ల వాటా 13 శాతం నుంచి 14 శాతానికి పెరిగింది. 3,000 చదరపు అడుగులకు పైబడిన ఇళ్ల వాటా 3 శాతం నుంచి 5 శాతానికి చేరింది. మొత్తంగా 2,000 చదరపు అడుగులకు పైబడిన విశాలమైన ఇళ్ల వాటా 16 శాతం నుంచి 19 శాతానికి పెరిగింది. 500 నుంచి 1,000 చదరపు అడుగుల ఇళ్లు 13 శాతం, 500 చదరపు అడుగుల లోపు ఇళ్లు 3 శాతం వాటాను నమోదు చేశాయి.

- రంగారెడ్డి జిల్లాలో రియల్ జోరు

జిల్లాల వారీగా రిజిస్ట్రేషన్లలో రంగారెడ్డి జిల్లా అగ్రస్థానంలో నిలిచింది. అక్టోబర్ నెలలో నమోదైన మొత్తం రిజిస్ట్రేషన్లలో ఈ జిల్లా వాటా 52 శాతంగా ఉంది. గతేడాది ఇదే నెలలో ఇది 47 శాతంగా ఉండటం గమనార్హం. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వాటా 39 శాతం నుంచి 29 శాతానికి తగ్గగా, హైదరాబాద్ జిల్లా వాటా 14 శాతం నుంచి 18 శాతానికి పెరిగింది. సంగారెడ్డి జిల్లా ఒక శాతం వాటాను నమోదు చేసింది. ఇక ధరల విషయానికి వస్తే హైదరాబాద్‌లో చదరపు అడుగు సగటు ధర వార్షికంగా 10 శాతం పెరిగి రూ.5,184కు చేరింది. రంగారెడ్డి జిల్లాలో 8 శాతం వృద్ధితో రూ.5,879, మేడ్చల్-మల్కాజిగిరిలో 8 శాతం పెరుగుదలతో రూ.3,807గా నమోదైంది. సంగారెడ్డిలో అత్యధికంగా 25 శాతం వృద్ధితో చదరపు అడుగు సగటు ధర రూ.3,005కు చేరింది.

- కోకాపేట్‌లో రూ.13.12 కోట్ల డీల్

అక్టోబర్‌లో అత్యంత ఖరీదైన ప్రాపర్టీ లావాదేవీలు కోకాపేట్, జూబ్లీహిల్స్, పుప్పాలగూడ ప్రాంతాల్లో నమోదయ్యాయి. 3,000 చదరపు అడుగులకు పైబడిన విలాసవంతమైన ఇళ్లలో ఒక్కో లావాదేవీ విలువ రూ.6.93 కోట్ల నుంచి రూ.13.12 కోట్ల వరకు ఉంది. రంగారెడ్డి జిల్లా కోకాపేట్‌లో ఒక ప్రాపర్టీ రూ.13.12 కోట్లకు రిజిస్టర్ కాగా, జూబ్లీహిల్స్‌లో మరో ప్రాపర్టీ రూ.13.06 కోట్లకు నమోదైంది.


కోకాపేట్‌లో రూ.10.57 కోట్లు, పుప్పాలగూడలో రూ.8.10 కోట్లు, కోకాపేట్‌లోనే మరో ప్రాపర్టీ రూ.6.93 కోట్లకు రిజిస్టర్ అయ్యాయి. అత్యధిక విలువ కలిగిన ఐదు లావాదేవీల్లో నాలుగు రంగారెడ్డి జిల్లాలోనే చోటుచేసుకోవడం ఆ ప్రాంతంలో పెరుగుతున్న ప్రీమియం రియల్ ఎస్టేట్ డిమాండ్‌కు నిదర్శనం.

- మే నెలలో అత్యధిక రిజిస్ట్రేషన్లు

ఈ ఏడాది నెలవారీ గణాంకాలను పరిశీలిస్తే మే నెలలో అత్యధికంగా 8,344 ప్రాపర్టీలు రిజిస్టర్ అయ్యాయి. వీటి విలువ రూ.5,887 కోట్లుగా నమోదైంది. ఏప్రిల్‌లో 6,837, జూన్‌లో 5,560, జూలైలో 6,166, ఆగస్టులో 5,937, సెప్టెంబర్‌లో 5,620, అక్టోబర్‌లో 5,318 రిజిస్ట్రేషన్లు జరిగాయి. తెలంగాణ రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ గణాంకాల ఆధారంగా రూపొందించిన నైట్ ఫ్రాంక్ నివేదికలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల పరిధిలోని ప్రైమరీ, సెకండరీ మార్కెట్ లావాదేవీలను పరిగణనలోకి తీసుకున్నారు. మొత్తంగా చూస్తే.. రిజిస్ట్రేషన్ల సంఖ్యలో స్వల్ప ఒడిదుడుకులు ఉన్నప్పటికీ, ప్రీమియం ఇళ్ల కొనుగోళ్లతో హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ విలువ పరంగా పటిష్టమైన వృద్ధిని కొనసాగిస్తోంది.

ఎన్విడియా సీఈఓ జెన్సన్ హువాంగ్ రాజీనామా

- కంపెనీ తాత్కాలిక సీఈఓగా కొలెట్ క్రాస్ నియామకం



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విప్లవంలో ప్రపంచ అగ్రగామిగా దూసుకుపోతున్న ప్రముఖ చిప్ తయారీ సంస్థ ఎన్విడియా లో తీవ్ర సంక్షోభం తలెత్తింది. సంస్థ వ్యవస్థాపకుడు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ) జెన్సన్ హువాంగ్ తన పదవికి రాజీనామా చేశారు. చైనా గూఢచారిగా భావిస్తున్న ఆలిస్ హువాంగ్ తో ఆయన వివాహేతర సంబంధం నేపథ్యంలో.. వివాదాలు ముదరడంతో డైరెక్టర్ల బోర్డు ఆయనపై చర్యలకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. అయితే, బోర్డు నిర్ణయం కంటే ముందే జెన్సన్ హువాంగ్ రాజీనామా నిర్ణయం తీసుకున్నారు. ఆయన స్థానంలో కంపెనీ తాత్కాలిక సీఈఓగా కొలెట్ క్రాస్ బాధ్యతలు చేపట్టారు. ఈ పరిణామాలకు దారితీసిన పరిస్థితులను పరిశీలిస్తే.. నవంబర్ 8న జెన్సన్ హువాంగ్ తాను భార్యకు నమ్మకద్రోహం చేశానని సంస్థ ఉద్యోగులకు స్వయంగా వెల్లడించారు. అయితే ఇందులో విదేశీ నిఘా ప్రమేయం ఏమైనా ఉందా అనే కోణంలో బోర్డులోని స్వతంత్ర డైరెక్టర్లు విచారణ ప్రారంభించారు. ఎన్విడియా క్లయింట్ అయిన సింగపూర్ సంస్థ మెగాస్పీడ్ ఎగ్జిక్యూటివ్ ఆలిస్ హువాంగ్‌తో ఆయనకున్న సంబంధం ఈ వివాదానికి కేంద్రబిందువుగా మారింది. ఆమె చైనా నిఘా వర్గాలకు ఏజెంట్‌గా వ్యవహరిస్తూ, అమెరికా నిబంధనలకు విరుద్ధంగా దాదాపు 7.5 బిలియన్ డాలర్ల విలువైన ఏఐ చిప్‌లను చైనాకు చేరవేయడంలో ఈ సంబంధాన్ని ఉపయోగించుకున్నారనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ అంశంపై ఇప్పటికే ఎఫ్‌బీఐ, అమెరికా న్యాయశాఖ విచారణ జరుపుతున్నాయి. మొదట్లో హువాంగ్‌కు అండగా నిలిచిన బోర్డు, ఆ తర్వాత ఆయనపై మరో వ్యక్తిగత వివాదం తెరపైకి రావడంతో వైఖరి మార్చుకుంది. ఎన్విడియా వైస్ ప్రెసిడెంట్ (హెల్త్‌కేర్) కింబర్లీ పావెల్‌తో కూడా ఆయనకు సంబంధం ఉన్నట్లు నివేదికలు రావడంతో డైరెక్టర్ల బోర్డు అత్యవసరంగా భేటీ అయింది. సంస్థ నియమావళి, జాతీయ భద్రత, కార్పొరేట్ విశ్వసనీయత దెబ్బతిన్న నేపథ్యంలో బోర్డు తొలగింపునకు సిద్ధం కావడంతో హువాంగ్ తప్పుకోవాల్సి వచ్చింది. సంస్థలో ఇప్పటివరకు ఎలాంటి వారసత్వ ప్రణాళిక లేకపోవడంతో, ఆర్థిక వ్యవహారాల్లో కీలకమైన కొలెట్ క్రాస్‌ను తాత్కాలిక సీఈఓగా నియమించారు.ఈ నాయకత్వ సంక్షోభం వాల్‌స్ట్రీట్‌తో పాటు అంతర్జాతీయ మార్కెట్లను కుదిపేసింది. బుధవారం సాధారణ ట్రేడింగ్‌లో 173.73 డాలర్ల వద్ద ముగిసిన ఎన్విడియా షేరు, తాజా పరిణామాల అనంతరం ఆఫ్టర్-అవర్స్ ట్రేడింగ్‌లో దాదాపు 8.6 శాతం పతనమై 158.78 డాలర్లకు పడిపోయింది. వివాదం మొదలైన నవంబర్ 8 నుంచి ఇప్పటివరకు కంపెనీ మార్కెట్ విలువలో సుమారు 430 నుంచి 600 బిలియన్ డాలర్ల మేర సంపద ఆవిరైంది. ఇదే సమయంలో ఎన్విడియా ప్రత్యర్థి సంస్థలైన ఏఎండీ, బ్రాడ్‌కామ్ షేర్లు లాభాల్లోకి దూసుకెళ్లాయి.మరోవైపు ఈ సంక్షోభం రాజకీయ, న్యాయపరమైన మలుపులు తిరుగుతోంది. నష్టపోయిన మదుపర్లు శాన్ జోస్ కోర్టులో క్లాస్ యాక్షన్ దావా వేశారు. చైనాకు చిప్‌ల తరలింపు వ్యవహారంపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు గతంలోనే సమాచారం ఉన్నట్లు వార్తలు రాగా, ఆయన దానిని తోసిపుచ్చారు. కాంగ్రెస్ సభ్యులు ఎలిజబెత్ వారెన్, క్రిస్ కూన్స్ తదితరులు ఎన్విడియా రికార్డులను భద్రపరచాలని, ఈ వ్యవహారంపై కాంగ్రెస్‌కు సమగ్ర వివరణ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. దశాబ్దాలుగా ఎన్విడియాను తిరుగులేని సాంకేతిక శక్తిగా నిలబెట్టిన జెన్సన్ హువాంగ్ ఒక్కసారిగా పదవీచ్యుతుడు కావడం ప్రపంచ టెక్ రంగాన్ని తీవ్ర విస్మయానికి గురిచేసింది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588